18వ వసంతంలోకి..
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
బుధవారం 9 అక్టోబరు 2024
పేజీలు 8

# కరెన్సీ నోట్ల అలంకరణలో శ్రీ మహాలక్ష్మి దేవి



చీమకుర్తిలోని శ్రీహరిహర క్షేత్రంలో శ్రీదేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా ఆరోరోజు శ్రీ మహాలక్ష్మి దేవిగా దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా కరెన్సీ నోట్లతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు.

# స్వర్ణ ప్రకాశంగా తీర్చిదిద్దుదాం

**జిల్లా అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలి**
**ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పరిపాలన**
**స్వర్ణాంధ్ర - 2047 ఏపి విజన్ అజెండాతో ప్రణాళికలు**
**వర్క్‌షాపులో మంత్రి డాక్టర్ డోల శ్రీ బాలవీరాంజనేయస్వామి**
**సమిష్టిగా కృషి చేద్దాం.. అభివృద్ధి చేద్దాం: ఎంపి మాగుంట**
**జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు: ఎమ్మెల్యే దామచర్ల**



ఒంగోలు, మేజర్‌న్యూస్ : స్వర్ణాంధ్ర - 2047 ఎపి విజన్ అజెండాతో రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా భాగస్వాములు కావాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజన్ రూపకల్పనలో భాగంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ఒంగోలు కలెక్టరేట్ లోని గ్రీవెన్స్ హాల్లో మంత్రి, ఎమ్మెల్యేలతో వర్క్ షాప్ నిర్వహించారు. మంత్రి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన రావు, ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణ రెడ్డి, డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాల క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర - 2047 విజన్‌ను అభివృద్ధి చేసేందుకు సమగ్ర కసరత్తు చేపట్టిందన్నారు. ప్రధాన మంత్రి చెప్పినట్లుగా 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తి అయ్యే నాటికి భారత దేశం పూర్తిగా అభివృద్ధి చెంది ఉండాలన్న లక్ష్యంతో వికసిత్ భారత్ పేరుతో అన్నీ రంగాలను అభివృద్ధి చేసేలా 2047 కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క ప్రాంతాన్ని మండల యూనిట్‌గా అభివృద్ధి

మిగతా 3లో



# భావితరాల భవిష్యత్తు 'స్వర్ణాంధ్ర 2047'

**బాధ్యతతో శ్రమిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలం**

**పేదరిక నిర్మూలన లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్**

**13వ శతాబ్దం నాటి మోటుపల్లి ఓడరేవు పునః నిర్మాణం**

**జిల్లాస్థాయి అవగాహన సదస్సులో మంత్రులు గొట్టిపాటి, అనగాని**

బాపట్ల, మేజర్‌న్యూస్: స్వర్ణాంధ్ర 2047 విజన్ అభివృద్ధి రాబోయే పౌరులకు ఎంతో ప్రయోజనంగా మారనుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర 2,047 జిల్లా స్థాయి అవగాహన సదస్సు మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్‌ను నిలపడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు వెళుతుందని రాష్ట్ర మంత్రి రవికుమార్ చెప్పారు. అధికారులు బాధ్యతతో శ్రమిస్తేనే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోగలమన్నారు. మన దేశంలో అధికంగా ఉన్న మానవ వనరులను సద్వినియోగం చేసుకుంటేనే అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. రాబోయే పౌరులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. బకింగ్ హామ్ కెనాల్ అభివృద్ధి చేసుకోగలిగితే ఓట్ల ద్వారా రవాణా పెరుగుతుంది ఆదాయ వనరుగా మారుతుందన్నారు. తద్వారా కాలుష్యాన్ని పూర్తిస్థాయిలో నియంత్రించవచ్చన్నారు. 13వ శతాబ్దం నాటి మోటుపల్లి ఓడరేవును పునఃనిర్మించడానికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ప్రతి గ్రామానికి తాగునీరు అందాలి, మరుగుదొడ్లు ఉంటేనే స్వచ్ఛత అమలవుతుందని సూచించారు. విద్యతోనే

మిగతా 3లో



# ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అండగా ఉంటాం

**సమస్యలను పరిష్కరిస్తాం, ఇంటి స్థలాలు అందజేస్తాం**
**రెండేళ్ళ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు అభినందనీయం**
**పోస్టల్ ప్రమాద బీమా పత్రాల పంపిణీలో దామచర్ల, మాగుంట**

ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్‌తో పాటు ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి భరోసాను ఇచ్చారు. గత రెండేళ్ల నుంచి అసోసియేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. మంగళవారం నగరంలోని ఒంగోలు ఇండియన్ మెడికల్ హాల్లో ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టల్ ప్రమాద భీమా పత్రాల పంపిణీకి ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల, ఎంపి మాగుంటతో పాటు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు కంది రవిశంకర్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాలాది మణి బాబు, సూర్య దినపత్రిక జిల్లా బ్రాంచ్ మేనేజర్ గొట్టిపాటి నాగేశ్వరరావు, హన్స్ ఇండియా స్టాఫ్ రిపోర్టర్ నందం నరేష్, ఒంగోలు డిఎస్పీ వి. శ్రీనివాసరావు, బిజెపి జిల్లా అధికార

మిగతా 3లో

ఉత్తరక్రియలు



సౌమ్యశీలి, సహనశీలి, స్నేహశీలి
ఎంతోమంది జీవితాలలో వెలుగులు నింపిన దానశీలి
మాగుంట ఇంటి దీపం, మా పెద్ద దిక్కు
స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి గారి సతీమణి
శ్రీమతి మాగుంట పార్వతమ్మ గారు
మాజీ పార్లమెంటు సభ్యురాలు, మాజీ శాసనసభ్యురాలు
సెప్టెంబర్ 25, 2024న స్వర్గస్తురాలైనారు.
వారి దివ్య ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...

జననం : 27.07.1947 నిర్యాణం : 25.09.2024

సుమాలిని - శివకుమార్‌రెడ్డి | గీతా లత - శ్రీనివాసులురెడ్డి
మమతారెడ్డి | స్నేహలతారెడ్డి
అనన్య - అనిష్ | సుహాసిని - మధుసూదన్‌రెడ్డి
దీప్తి - గౌతమ్‌రెడ్డి | చందన - రాఘవ్‌రెడ్డి
స్వాతి - కిరణ్‌రెడ్డి | నిఖిల్

మాగుంట సుబ్బరామ్‌రెడ్డి
మరియు మాగుంట కుటుంబం

పెద్దకర్మ : తేది. 09-10-024 బుధవారం ఉదయం11.30 గంటలకు
నెల్లూరు, సరస్వతీనగర్‌లోని 'మాగుంట నివాసం' నందు జరుగును.

# 'పల్లె పండుగ'లో పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టాలి



## వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్ : గ్రామసభలలో గుర్తించిన పనులన్నింటినీ వచ్చేవారం 'పల్లె పండుగ' కార్యక్రమంలో పూర్తిస్థాయిలో ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా చెప్పారు. ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ మంగళవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ప్రకాశం భవనం నుంచి ఆమె పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టే పనుల వివరాలను ఈ సందర్భంగా కలెక్టర్ వివరించారు. 972 పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చామని, 928 పనులకు సాంకేతిక అనుమతులు లభించాయని చెప్పారు. పెండింగ్లో ఉన్న ప్రతిపాదనలకు కూడా సాంకేతిక అనుమతులు లభిస్తే వాటినీ చేపడుతామని తెలిపారు. నిర్మాణ పనులు చేపట్టడానికి ఇసుక పరంగా సమస్యలు లేవని, సిమెంటు సరఫరా సకాలంలో జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షిస్తే జనవరి నాటికి ఈ పనులన్నీ పూర్తయ్యేలా చూస్తామని కలెక్టర్ చెప్పారు. పనులన్నీ చేపట్టడానికి సంబంధిత స్థానిక ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని ఆమె వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో డ్వామా పి.డి జోసఫ్ కుమార్, డిపిఓ ఉషారాణి, జెడ్పి సీఈవో చిరంజీవి, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

# స్వర్ణ ప్రకాశంగా తీర్చిదిద్దుదాం

**మొదటి పేజీ తరువాయి** పథంలో నడిపించేలా ముందుకు పోతున్నామన్నారు. ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంతో ముందుకు పోతున్నట్లు, అలాగే యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాలను అమలు చేస్తూ యువత సేవలను సమర్ధవంగా వినియోగించుకొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. స్కిల్ సెన్సెస్ కూడా చేపడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవడం జరుగుచున్నదన్నారు. పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఏం.ఎస్.ఏం.ఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాలో ఫార్మా రంగాన్ని ముందుకు తీసుకువచ్చేందుకు అలాగే జిల్లాలో గ్రానైట్ రంగానికి మరింతగా ప్రోత్సాహం కల్పించేలా ముందుకు పోతున్నట్లు మంత్రి తెలిపారు.

### ప్రజలు భాగస్వాములు కావాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంటరీని రాష్ట్రంలో తయారు చేయడం జరుగుచున్నదన్నారు. అందులో భాగంగా ప్రకాశం జిల్లా కు సంబంధించి విజన్ డాక్యుమెంట్‌ను తయారు చేయడానికి శాఖల వారిగా రెండు నెలల నుంచి ఈ విజన్ డాక్యుమెంట్‌ను ఎలా తయారు చేయాలనే విషయాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. మన జిల్లా అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అన్ని రంగాల ప్రజలను భాగస్వాములు చేసి అందరి సలహాలు సూచనలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.













### జిల్లా అభివృద్ధికి కృషి: ఎంపి మాగుంట

ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనలతో నన్ను కేంద్ర హౌసింగ్ అర్బన్ డెవలప్మెంట్ పార్లమెంట్ కమిటీకి ఛైర్మన్‌గా నియమించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఈ కమిటీలో అమృత్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు వుంటాయని, రానున్న రోజుల్లో ప్రకాశం జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని మాగుంట శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

### విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలి

స్వర్ణాంధ్ర-2047 విజన్ డాకుమెంటరీ రూపకల్పనలో జిల్లా అన్నీ రంగాలలో అభివృద్ధి ప్రధంలో ముందుకు వెళ్ళేల్లా, ముఖ్యంగా వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రాంత అభివృద్ధిని దృష్టిలో వుంచుకొని స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలని అందుకనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై ఈ కార్యక్రమానికి హాజరైన ఒంగోలు, గిద్దలూరు, మార్కాపురం, కనిగిరి శాసన సభ్యులు దామాచర్ల జనార్ధన రావు, ముత్తుముల అశోక్ రెడ్డి, కందుల నారాయణ రెడ్డి, డా. ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి తమ అభిప్రాయాలను, సూచనలు తెలియచేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, మత్స్య శాఖ, పరిశ్రమలు, జల వనరులు, ఆర్.డబ్ల్యు. ఎస్., పర్యాటక శాఖలు రూపొందించిన విజన్ డాక్యుమెంట్ ను సంబంధిత శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ వర్క్ షాప్ లో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వేంకటేశ్వర రావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు అండగా ఉంటాం

**మొదటి పేజీ తరువాయి** ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, ఎస్ఎన్‌పాడు కాంగ్రెస్ ఇన్‌చార్జ్ పాలపర్తి విజేష్‌రాజ్, యూనియన్ బ్యాంక్ రిటైర్ మేనేజర్ మస్తానయ్యలు ముఖ్యఅతిథులుగా పాల్గొని సభ్యులకు పత్రాలు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్‌బాబు అధ్యక్షత వహిస్తూ గత రెండు సంవత్సరాలుగా అసోసియేషన్ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ముఖ్య అతిథులకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే జనార్ధన్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రమాద బీమా పాలసీ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రమాద బీమా పాలసీ కొరకు సహాయ సహకారాలు అందించిన ప్రముఖ పారిశ్రామికవేత్త కంది రవిశంకర్‌ను ఆయన అభినందించారు. ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులో వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు ఎలాంటి అవసరం వచ్చిన తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు పారిశ్రామికవేత్త, జనసేన నాయకులు కంది రవిశంకర్ అండగా ఉండి ప్రమాద బీమా పాలసీని ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అభినందించారు. జర్నలిస్టులకు ఎవరికి ఏ అవసరం వచ్చినా తాము ఎప్పుడూ అండగా ఉంటామని తెలిపారు. పారిశ్రామికవేత్త జనసేన నాయకులు కంది రవిశంకర్ మాట్లాడుతూ జర్నలిస్టులు తమ కుటుంబ సభ్యులు అని చెప్పారు. పాలసీలే కాకుండా ఎలాంటి అవసరాలు వచ్చినా తాను ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమం అనంతరం అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథులకు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించి కంది రవి శంకర్‌ను గజమాలతో గౌరవించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గేరా అజయ్ బాబు, ఉపాధ్యక్షులు అంగలకుర్తి ప్రసాద్ ప్రధాన కార్యదర్శి ఒంగోలు వసంత్ కుమార్ కోశాధికారి వేశపోగు కోటయ్య, సభ్యులు సర్వేశ్వరరావు, మక్కెన రత్నం, వార్తా సునీల్, వెస్పా, అనిల్, శ్రీలేఖ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# భావితరాల భవిష్యత్తు 'స్వర్ణాంధ్ర 2047'

**మొదటి పేజీ తరువాయి** ప్రజలలో అంతరాల అడ్డు నూరు శాతం తొలగిపోతుందన్నారు. విద్యా రంగంలో పాఠ్యాంశాలు మారాలి, అభివృద్ధికి తగినట్టుగా విద్యా విధానంలో మార్పులు జరగాలని కోరారు. ప్రపంచీకరణ వ్యవస్థతో పోటీపడేలా యువత అభివృద్ధి జరగాలంటే విద్యారంగం సంస్కృతి మారాలని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ, ఆక్వా రంగాలలో ఉత్పత్తులు గణనీయంగా పెరిగేలా ప్రణాళికలు రచించడం అభినందనీయమని చెప్పారు. వ్యవసాయంపై ఆధార పడిన బాపట్ల జిల్లాలో చివరిలో ఉన్న ప్రతి ఎకరాకు నేరు అందిస్తే ఉత్పత్తులు మరింత పెరుగుతాయన్నారు. సాంకేతిక ఆధునీకరణలను వ్యవసాయ రంగంలోకి తెస్తే సత్ఫలితాలు సాధించవచ్చన్నారు. పరిశ్రమలు ఏర్పడితే ఉద్యోగ సమస్య తీరుతుందని, ఉపాధి, ఆదాయ వనరులు పెరుగుతాయన్నారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా స్వర్ణాంధ్ర 2047 విజన్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ప్రజల జీవనం మెరుగుపడాలని సూచించారు. బాపట్ల జిల్లా అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. అన్ని రంగాలలో అభివృద్ధి జరిగేలా అధికారులు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మరింత ముందుకు వెళ్లడానికి చర్యలు తీసుకుంటుందన్నారు. మార్పు దిశగా అందరూ ముందుకు సాగాలని, యంత్రంగం






తమ వంతు సహాయ సహకార అందించాలన్నారు. గ్రామస్థాయిలో అభివృద్ధి జరిగితే జిల్లా, రాష్ట్రం, దేశం పురోభివృద్ధిలో పయనిస్తుందన్నారు. స్వర్ణాంధ్ర దిశగా బృహత్తరమైన ప్రణాళిక, మంచి ఆలోచనలతో రాష్ట్రాన్ని అభివృద్ధిలోకి సీఎం తీసుకువెళ్తున్నారని వివరించారు. అభివృద్ధికి ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలకు మెరుగైన జీవనం అందించాలని లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు.

వికసిత భారత్ 2047 దిశగా అందరూ అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. స్వర్ణాంధ్ర లక్ష్యం, విజన్ బాపట్ల దిశగా అడుగులు వేయాలని సూచించారు. ప్రజల తలసరి ఆదాయం రూ.1.84 లక్షలు ఉండగా, రూ.15 లక్షలకు పెరగాలని చెప్పారు. ప్రధానమంత్రి మోదీ మిషన్ మోడ్‌లో పని చేస్తున్నారని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర కోసం నిరంతరం కృషి చేస్తున్నారని వివరించారు.

భవిష్యత్తు తరాలకు అందరూ కలిసికట్టుగా తోడ్పాటునందించాలని పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు అన్నారు. సూక్ష్మ ప్రణాళికతోనే అభివృద్ధిని సాధించగలమన్నారు. ముఖ్యంగా వ్యవసాయానికి సమగ్ర ప్రణాళిక ఉండాలన్నారు. ప్రతి ఎకరాకు నీరందిస్తేనే ఇది సాధ్యమన్నారు. భవిష్యత్తు తరాలకు అన్ని వనరులు సమకూర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కోస్తా తీర ప్రాంతంలో ప్రజలందరికీ సురక్షితమైన తాగు నీరు సమృద్ధిగా అందించగలిగితే అభివృద్ధి బాటలోకి బాపట్ల జిల్లాలో అడుగులు వేస్తోందని చీరాల శాసనసభ్యులు ఎం.మాలకొండయ్య అన్నారు. చేనేత రంగాన్ని ఆధునికీకరణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. చర్చించిన అంశాలన్నీ అమల్లోకి తీసుకురావాలన్నారు. మరింత ప్రాణాలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. బాపట్ల జిల్లాలో బీచ్‌ల అభివృద్ధి జరిగితే భవిష్యత్తులో అన్ని రంగాలు అభివృద్ధిలోకి వెళ్తాయని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేస్తే అభివృద్ధి చాలా సులువేనన్నారు. 2,047 నాటికి మనం ఏం చేయాలి, ఎలాంటి ఆలోచనలతో ముందుకు వెళ్లాలో ప్రణాళికలతో సాగాలన్నారు. అనంతరం మత్స్యకారులకు ఇస్రో రూపొందించిన ట్రాన్స్ పాండర్‌లను 150 మంది మత్స్యకారులకు మంత్రులు, జిల్లా కలెక్టర్ చేతులమీదుగా పంపిణీ చేశారు. 40 వేలు విలువచేసే ఒక్కొక్క యంత్రం పనితీరును వివరించారు. స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమంపై పాఠశాలల్లో ఏర్పాటుచేసిన క్విజ్, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థినిలకు ధ్రువీకరణ పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ సన్నిదిలో రెవిన్యూ మంత్రి అనగాని



రేపల్లే, మేజర్‌న్యూస్: కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యపసాద్ తెలిపారు. దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని విజయవాడ ఇంద్రీలాద్రి పై ఉన్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారిని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనాలు, మధ్య అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో కనకదుర్గమ్మ అమ్మవారికి శేష వస్త్రాలు అందజేసి ప్రత్యక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ కనకదుర్గ అమ్మవారిని ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మి దేవి రూపంలో అలంకరించి పూజలు చేశారు. ఉత్సవాల సంధర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తున్న భక్తులకు ఏర్పాటు చేసిన క్యూ లైన్ ల లో అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అధికారులంతా సమన్వయంతో పనిచేసి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# కనిగిరి మున్సిపాలిటీకి త్వరలో రామతీర్థం సాగర్ నీరు



కనిగిరి, మేజర్‌న్యూస్: రామతీర్థం సాగర్ నీరు నెల రోజుల్లో కనిగిరి మున్సిపాలిటీకి వచ్చే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. చినారికట్ల వద్ద గల పంప్ హౌస్‌ను ఎమ్యెల్యే మంగళవారం పరిశీలించారు. సాగర్ నీరు దర్శి కెనాల్ నుండి చినారికట్ల పంప్ హౌస్ ద్వారా వచ్చేవని గత 3, 4 ఏళ్లుగా కనిగిరి మున్సిపాలిటీకి సాగర్ నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు .చినారికట్ల వద్ద గల పంప్ హౌస్ మోటార్స్, పైప్ లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. 2 నూతన మోటార్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు పునుగొడు రోడ్డులో గల పంప్ హౌస్ నుంచి మున్సిపాలిటీకి నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. చినారికట్ల పంప్ హౌస్, పైప్ లైన్ పనులు పూర్తి అయితే కనిగిరి మున్సిపాలిటీకి సాగర్ నీరు సరఫరా జరుగుతుందన్నారు.

# సీఎం సహాయ నిధికి రూ 33,880 వేలు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ఇటీవల కురిసిన భారీ వరదల కు విజయవాడ,మరియు కృష్ణానది పరివాహక లంక గ్రామాలు భారీగా దెబ్బ తిన్న నేపథ్యంలో,మండల కేంద్రమైన భట్టిప్రోలు తమ్మన మల్లిఖార్జునరావు ఉన్నత పాఠశాల కు చెందిన విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు గ్రామంలో విరాళాలు సేకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చందులూరు రామకోటేశ్వరరావు సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ 33880 లు సేకరించటం జరిగిందని,ఈ నగదును చెక్కు రూపంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించాలనే సంకల్పంతో వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు వద్దకు వెళ్ళామన్నారు. చెక్కును ఆనందబాబు కు గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలసి అందించామన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండంట్ పులికొండ మల్లిఖార్జునరావు,పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ ఏ సుగుణ,ఉపాధ్యాయులు చెన్నా వెంకట ఉమామహేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇద్దరి యాత్రికుల ప్రాణాలు కాపాడిన పోలీస్



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లాలో సూర్యలంక సముద్ర తీరంలో యాత్రికుల రక్షణ కొరకు పటిష్ట చర్యలు తీసుకున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా పోలీస్ అధికారులు సూర్యలంక సముద్రతీరంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.మంగళవారం వివిధ ఘటనలలో సూర్యలంక సముద్ర తీరంలో విహారానికి వచ్చిన యాత్రికులు ఇరువురు అలలు తాకడికి సముద్రంలోకి కొట్టుకుపోతుండగా అవుట్ పోస్టులో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు యాత్రికుల ప్రాణాలను కాపాడారు.వివరాలలోకి వెళితే మంగళవారం సూర్యలంక సముద్ర తీరంలో వేరు వేరు ఘటనలలో సముద్రంలో మునిగిపోతున్న ఇద్దరు యాత్రికులను అవుట్ పోస్ట్ పోలీస్ సిబ్బంది, మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు వారి ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ఇరువురు యాత్రికులను రక్షించి ఒడ్డుకు తీసుకు వచ్చి ప్రధమ చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించినారు. పోలీస్ సిబ్బంది గజ ఈతగాళ్లు స్పందించిన తీరు పట్ల యాత్రికులు హర్షం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులు, తోటి యాత్రికులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.సికింద్రాబాద్ కు చెందిన 44 సంవత్సరాల వయస్సు గల దయాకర్ మహేష్ చెన్నైలో సాఫ్టువేర్ ఉద్యోగం చేసేవాడు. అతడు వారి కుటుంబ సభ్యులతో పాటు ఆహ్లాదంగా గడపడానికి విహార యాత్రకు సూర్యలంక సముద్ర తరానికి వచ్చినాడు. సముద్రంలో మునుగుతూ పోలీస్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి ఎక్కువ లోతుకు వెళ్లడంతో ఒక్క సారిగా వచ్చిన రాకాసి అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకు పోతుండగా అతడిని రక్షించారు. మరొక ఘటనలో గుంటూరు పట్టణంలోని లక్ష్మీపురం ప్రాంతానికి చెందిన 13 సంవత్సరాల వయసు గల నున్న మహేష్ అను బాలుడు వారి కుటుంబ సభ్యులతో పాటు విహారయాత్రకు సూర్యలంక సముద్ర తీరానికి వచ్చి సముద్రంలో స్నానం చేస్తుండగా ఒకసారిగా వచ్చిన అలల తాకిడికి సముద్రంలోకి కొట్టుకు పోతుండగా కుటుంబ సభ్యులు ఆహాహాకారాలు చేస్తుండడంతో వెంటనే గమనించి బాలుడు ప్రాణాలను కాపాడారు.తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా యాత్రికులను కాపాడేందుకు సముద్రంలోకి వెళ్లి వారిని రక్షించి ఒడ్డుకు చేర్చి ప్రధమ చికిత్స అందించి సురక్షితంగా వారి కుటుంబ సభ్యులకు అప్పగించిన సూర్యలంక అవుట్ పోస్టులో విధులు నిర్వహించే హెడ్ కానిస్టేబుల్ సుభాని సాహెబ్, మెరైన్ హెూంగార్డ్ నాయుడు శ్రీను, గజ ఈతగాళ్లు నాగేశ్వరరావు, మీరా సాహెబ్, రామయ్య, శ్రీను లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల నిర్వహణకు సిద్ధం: కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలు అక్టోబర్ 14 నుంచి 20 వ తేదీ వరకు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో రాజధాని నుంచి మంగళవారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. బాపట్ల జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. గ్రామాల అభివృద్ధి కొరకు మంజూరైన పనులపై గ్రామ సభలలో ముందస్తుగా ప్రచారం చేయాలని మంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. గ్రామాలలో ఏ పనులు జరుగుతున్నాయో ప్రజలకు అవగాహన ఉండేలా ప్రచార బోర్డుల్లో వివ రాలు ప్రకటించాలన్నారు. మంజూరైన పనులన్నీ సంక్రా ంతి నాటికి పూర్తి చేయాలని సూచించారు.బాపట్ల జిల్లా లో మంజూరు చేసిన 1,232 పనులను రూ.288 కోట్ల నిధులతో పూర్తి చేయడానికి అన్ని చర్యలు తీసుకు ంటున్నామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లాలో 459 గ్రామ పంచాయతీలు ఉన్నాయని ఆయనకు వివరించారు. సాధారణ నిధులు రూ.38 కోట్లు ఉం డగా, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.67 కోట్లు జిల్లాకు కేటా యింపులు జరిగాయన్నారు. అందులో రూ.33 కోట్లతో స్మశాన వాటికలు, బస్టాండ్లు, తాగునీటి పైపులైన్లు, బోర్ వెల్స్ మరమత్తుల కొరకు 1,176 పనులు చేపడుతు న్నామన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.88 కోట్ల పనులను ఇప్పటికే అధికారికంగా ఆమోదించామన్నారు. ప్రజాప్రతినిధుల భాగస్వామ్యంతో అక్టోబర్ 14 నుంచి పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాలలో పనులు ప్రారంభి స్తామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఈనెల 16 నుంచి ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. సిమెంట్ కొరత ఉందన్నారు. సంక్రాంతి పండుగ నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సమావేశంలో జిల్లా నుంచి పి ఆర్ ఎస్ఈ హారేరా మకృష్ణ, డిపిఓ, డ్వామా పీడీ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ ధనలక్ష్మి దేవి గా వాసవి అమ్మవారు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: దేవిశరన్నవరాత్రి మహెూత్సవాలలో భాగంగా 6వ రోజైన మంగళవారం శ్రీవాసవి మాత అమ్మవారు శ్రీ ధనలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చింది. అమ్మవారికి పూజలను మాటూరు తాండవ కృష్ణమూర్తి-లక్ష్మి సుజాత,మద్దుల గోవిందరాజులు-చంద్ర లక్ష్మి కుమారి,బుర్లే వెంకట సుబ్రహ్మణ్యం-వెంకట శ్రీలక్ష్మి, బొలిశెట్టి వెంకట సునీల్ కుమార్-శ్రీలక్ష్మి, తూనుగుంట్ల ఈశ్వర్- ఆల్వార్ హారిక,మాటూరు వెంకట శివ నాగేశ్వరరావు-వెంకటలక్ష్మి కుమారి,ఆకుల వెంకటేశ్వరరావు- ఝాన్సీ వాణి, కొత్తమాసు భాస్కరరావు-సరోజిని,తూనుగుంట్ల వెంకటేశ్వర గుప్తా-రమాదేవి మరో ఆరుగురు దంపతులు పూజలు నిర్వహించారు.దేవస్థాన ప్రధాన అర్చకులు వల్లూరి చరణ్ సాయి శర్మ భక్తులచే పూజలు జరిపించారు.అమ్మవారికి అలంకారాలను తూనుగుంట్ల శ్రీనివాసరావు,తూనుగుంట్ల వెంకట లక్ష్మీనరసింహారావు, ఆత్మూరి ప్రేమ సాయి హరనాథ్ లతో పాటు మరో 11 మంది అమ్మవారికి అలంకారాలు చేయించారు. మానేపల్లి కాశీ విశ్వేశ్వరరావు-రమా పద్మావతి,తడికమళ్ళ పుల్లారావు- రామలింగేశ్వరమ్మ,మానేపల్లి సాయి గణేష్ కుమార్-శశికళ,మద్దుల శ్రీనివాసరావు-లక్ష్మి నాగకుమారి, మాజేటి వెంకట ధర్మ తేజ-ఝాన్సీ లక్ష్మి దంపతులు ప్రసాద ద్రవ్యాలను అందించారు.లక్కీడిప్‌ను బొలిశెట్టి వెంకట సునీల్ కుమార్ ఆధ్వర్యంలో,బొలిశెట్టి వెంకట నాగ మణికంఠ శ్రీరామ్,వెంకట నాగ సాయి కనకమహాలక్ష్మి లు స్పాన్సర్ చేశారు.రాత్రి 7 గంటలకు ధనలక్ష్మి అమ్మవారికి ముత్యపు శంఖుతో 150 మంది మహిళల సామూహిక కుంకుమ పూజ ను దేవస్థాన మహిళా కమిటీ సభ్యులైన బోర్లు అరుణకుమారి తూనుగుంట నాగ సుధారాణి,మాటూరు గృహలక్ష్మి కొత్తమాసు ధనలక్ష్మి ల ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా,గౌరవ అధ్యక్షులు మానేపల్లి చిన బుచ్చయ్య,కార్యదర్శి ఆలపాటి ఉపేంద్ర, కోశాధికారి మాజేటి వెంకటేశ్వరరావు,కమిటీ సభ్యులు మహిళా కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

# కిట్స్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు

- చదువు నేర్పించిన కళాశాలకు మీ తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురండి
- కళాశాల చైర్మన్ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు




మార్కాపురం, మేజర్‌న్యూస్: స్థానిక కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రోజున ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ అండ్ మిషన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెంట్ విభాగపు ఆధ్వర్యంలో ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ అన్న కృష్ణ చైతన్య ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ అన్నా రాంబాబు పాల్గొని మాట్లాడుతు ముందుగా మొదటి సంవత్సరం, రెండో సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. అలానే ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు కూడా విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని కోరారు. అలానే మా కళాశాలలో ఉన్నటువంటి ప్రతి ఫెసిలిటీని ఉపయోగించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా ఒక ప్లానింగ్, ఒక పద్దతిలో ఉండి మంచి ఉత్తీర్ణత సాధించి, చదువు చెప్పించిన మాకు, మిమ్మల్ని కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి, అలానే మీరు అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని,సమాజానికి ఉపయోగపడే విధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ వి.కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.రంగనాయకులు, కళాశాల ఏవో బి.ప్రభాకర్, వివిధ విభాగపు అధిపతులు పి.రామ్మోహన్, డాక్టర్ జెవి అనిల్ కుమార్, కే.రాముడు, కే.కిషోర్ బాబు, ప్రసన్న మురళి, జే.రమణారెడ్డి, ఏ.అమృతవల్లి, పి.మనోహర్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్.రంగస్వామి, ఎన్‌వి ఎస్‌ఎన్ అంజనీ కుమార్, ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రెవిన్యూ డివిజన్ అధికారిణిగా రామలక్ష్మి బాధ్యతలు స్వీకరణ



రేపల్లే, మేజర్‌న్యూస్: రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారిణిగా రామలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.అనంతరం అమరావతి సచివాలయంలో మంత్రి అనగాని సత్యప్రసాద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.

## గవర్నర్‌ను కలిసిన బాపట్ల ఎస్పీ



బాపట్ల, మేజర్‌న్యూస్: వ్యక్తిగత పర్యటన నిమిత్తం బాపట్ల జిల్లా పాండురంగాపురం లోని గోల్డెన్ రిసార్ట్స్ కు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ను బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు.

## డి.ఎస్.పి.గా ఆవుల శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ



రేపల్లే, మేజర్‌న్యూస్: రేపల్లె నూతన డిఎస్పీగా ఆవుల శ్రీనివాసరావు మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలో భాగంగా పుట్టపర్తి మహిళా పోలీస్ స్టేషన్ నుండి రేపల్లె డీఎస్పీగా బదిలీపై వచ్చారు. అనంతరం రాష్ట్ర మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరులు అనగాని శివప్రసాద్‌ని మర్యాదపూర్వకంగా కలసి పుష్ప గుచ్ఛం అందచేశారు.

## రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ జయరావు మృతి



టంగుటూరు, మేజర్‌న్యూస్: పోలీస్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న జి.జయరావు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన ప్రకారం హెడ్ కానిస్టేబుల్ జయరావు మంగళవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై కొణిజేడు నుండి ఒంగోలుకు బయలుదేరి ఒంగోలు సమీపంలోని భగీరథ ఫ్యాక్టరీ సమీపంలో మలుపు వద్ద ప్రమాద శాత్ క్రింద పడిపోగా తీవ్ర గాయాలు కావడంతో ఒంగోలులోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెంది నట్లు పోలీసులు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ జయరావు మృతికి స్థానిక ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు, టంగుటూరు పోలీస్ సిబ్బంది తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. జయరావు మృతదేహానికి అడిషనల్ ఎస్పీ, ఒంగోలు డి.ఎస్.పి శ్రద్ధాంజలి ఘటించారు. జయరావు సొంత గ్రామం పెరిదేపులో నేడు అంత్యక్రియలు జరగనున్నట్లు పోలీసులు తెలిపారు.

# చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

### సీనియర్ సివిల్ జడ్జి ఏ వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: దేశంలో అమలులో ఉన్న చట్టాల పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రేపల్లె మండల న్యాయ సేవాధికార సభ్యులు, సీనియర్ సివిల్ జడ్జి ఏ వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం వద్ద 'విధాన్ సే సమాధాన్'-మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయ విజ్ఞాన సదస్సుకు మండల తహసీల్దారు ఎం శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చట్టాలు మరియు న్యాయ సంబంధమైన పరిధి తదితర విషయంలో సరైన అవగాహన లేక గ్రామీణ ప్రాంతాల ప్రజలు పలు ఇబ్బందులకు గురవుతున్నారని అభిప్రాయపడ్డారు. ఖాళీ నోట్లపై ఇస్తాను సారంగా సంతకాలు చేసి అప్పులు పొందటం చేయకూడదన్నారు. తరువాత నాకు ఇబ్బంది లు ఎదుర్కొంటారని తెలిపారు.అప్పు ఇచ్చిన వ్యక్తి ప్రాంసరీ నోటు పై తప్పనిసరిగా పద్ధతులు ప్రకారం లిఖించాలన్నారు.సీనియర్ అడ్వకేట్ షేక్



అమీనా రెహమాన్ ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా మహిళలకు ముఖ్యంగా బాలికలకు చట్టంలో పొందుపరచబడిన నూతన సెక్షన్ల గురించి అవగాహన కల్పించారు. అదేవిధంగా అప్పుడే పుట్టిన పిల్లలనుండి 18 సంవత్సరాల వయసు వచ్చే వరకు బాల బాలికలపై జరుగుతున్న అత్యాచార ఘట నలు సంబంధిత అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.కేవలం ఆడపిల్లలపై మాత్రమే కాక,మగ పిల్లలపై కూడా ఇటువంటి అఘాయిత్యాలు జరుగుతున్నాయని వాటిని కూడా దృష్టిలో ఉంచుకొని సమాజంలో మసలు కోవాల్సిన అవసరం ఉందని వారు అవగాహన కల్పించారు. సమాజంలో జరుగు తున్న అసాంఘిక కార్యకలాపాలు వాటితో పాటు పలు హింసాత్మక ఘటనల గురించి వీడియో రూపంలో మహిళలకు అవగాహన కల్పిం చారు. అనంతరం రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెంకటే శ్వర్లు మహిళలకు ప్రోత్సా హక బహుమతులు అందజేశారు.ఈ కార్యక్ర మంలో సీని యర్ అడ్వకేట్ షేక్ అమీనా రెహమాన్ గ్రామ సర్పంచ్ ధారా రవికి రణమయి,గ్రామపంచాయతీ సభ్యులు, డ్వాక్రా మహిళలు, యానిమేటర్లు, మరియు మండల పరిషత్ కార్యాలయ ఏవో జలజ, సిబ్బంది మండల రెవెన్యూ కార్యాలయం సిబ్బంది, వేమూరు సీఐ పసుపులేటి ఆంజనేయులు,పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## సూరేపల్లి విద్యార్థినికి జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి

భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: స్వర్ణాంధ్ర 2047 అనే అంశంపై ఇటీవల నిర్వహించిన వక్తృత్వ పోటీలలో జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి పొందిన మా పాఠశాల పదవ తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని శనగపల్లి నవ్య మంగళవారం బాపట్ల జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతిని అందుకు న్నదన్నదని మండలంలోని సూరేపల్లి విపి అండ్ జి ఎస్ ఎం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాస శర్మ తెలి పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు విచ్చేసి విద్యార్థుల బహుమతి ప్రధానం లో పాల్గొన్నారని హెచ్



ఎం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సూరేపల్లి పాఠ శాలలో జరిగిన ఒక కార్యక్రమంలో శిక్షణ ఇచ్చిన కె.శ్యామ్ కుమారిని,విద్యార్థిని శనగపల్లి నవ్యను పాం శాల పాలకవర్గ అధ్యక్షులు వేపూరి చలమయ్య, కార్యదర్శి రావు వెంకటకృష్ణారావులు, పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

## కిలారి రోశయ్యను కలిసిన బాపట్ల జనసేన నాయకులు

బాపట్ల, మేజర్‌న్యూస్ : గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ శాసనసభ్యులు కిలారి రోశయ్య జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్న సందర్భంగా గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ బాపట్ల కార్యదర్శి గుంటుపల్లి తులసి



కుమారి, కారుమూరి ఆంజినేష్ నాయుడు, న్యాయవాది కత్తి నాగలక్ష్మి, తదితరులు.

## ప్రపంచ తెలుగు సాహిత్య కళా జాతర బ్రోచర్ ఆవిష్కరణ

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా త్రిపురాంతకంలో మంగళవారం అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక సాహిత్య పిపాసి, ప్రభుత్వ గుర్రం జాషువా అవార్డు గ్రహీత, పద్మ భూషణ్ బోయి భీమన్న జీవిత సాఫల్య పురస్కార గ్రహీత, అక్షర తపస్వి డా.కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరీ భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి డా. టి. పార్థసారథి సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కల నాసరయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ముఖ్య అతిథిగా మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి జి.రాజ్ కుమార్, ఎం.పి.పి గొట్టిముక్కల రిబ్కా ప్రసాద్ చేతుల మీద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగు కవులు, రచయితలు, కళాకారులు, సాహిత్యాభిమానులకు సాదర ఆహ్వానం పలుకుతూ ఈ నెల 19, 20వ



తేదీలలో తాడేపల్లిగూడెం పశ్చిమగోదావరి జిల్లాలో శ్రీశ్రీ కళావేదిక మరో ప్రపంచ రికార్డు 24 గంటల 24 నిమిషాల 24 సెకండ్ల నాన్ స్టాప్ ప్రపంచ రికార్డు కార్యక్రమం నిర్వహిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని పశ్చిమ ప్రకాశం జిల్లాలోని కవులు, కళాకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ బొందలపాటి శాంతరావు, ఉపాధ్యాయుడు గోదా దయాకర్, గొట్టిముక్కల ఆనంతరావు, సత్తెనపల్లి ఇజ్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

## పోలేరమ్మ ఆలయంలో పూర్ణచంద్రరావు దంపతులు పూజలు



జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండలంలో మాజీ జడ్పీటిసి దామచర్ల పూర్ణచంద్రావు దంపతులు మంగళవారం మండల పరిధిలోని కామేపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ ఈవో వై.బైరాగి చౌదరి ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. దామచర్ల పూర్ణచంద్రావు దంపతులకు ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. వీరి వెంట మండల టిడిపి కన్వీనర్ పోకూరి రవీంద్రబాబు, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరు రాంబాబు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు




కొండేపి, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన కొండేపిలో మంగళవారం రోజు రాత్రి 9 గంటల సమయంలో మద్దులూరు రోడ్‌లో ఒకవ్యక్తి 10 మ్యాన్షన్ హౌస్ మందు బాటిళ్లు తీసుకువెళ్తుండగా సమాచారం అందుకున్నటువంటి కొండేపి ఎస్సై జి.ప్రేమ్ కుమార్ అతనిది అదుపులోకి తీసుకొని మద్యం బాటిళ్లు స్వాధీన పరుచుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ అంకారావు తదితరులు ఉన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టును తక్షణమే పూర్తి చేయాలి: సీపీఐ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

మార్కాపురం, మేజర్‌న్యూస్: నిరంతరం కరవు కాటకాలతో సతమతమవుతున్న పశ్చిమ ప్రకాశానికి ఏకైక పరిష్కార మార్గమైన పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు తక్షణమే రూ.2 వేల కోట్లు వచ్చే బడ్జెట్లో కేటాయించాలని, అలాగే ఈ ప్రాంత ప్రజల పరిపాలన సౌలభ్యం దృష్ట్యా మార్కాపురం కేంద్రంగా జిల్లా ప్రకటించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో అఖిలపక్ష ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం జిల్లా పార్టీ కార్య దర్శి ఎం ఎల్ నారాయణ అధ్యక్షతన



జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కె.రామకృష్ణ మాట్లాడుతూ గత ఏడు దశాబ్దాలుగా పశ్చిమ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాధారం తప్ప మరో నీటి ప్రత్యామ్నాయం లేని పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ ప్రాజెక్టే శరణ్యమని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఈశ్వ రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టీవీఎన్ స్వా మి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్‌కె సైదా, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి.సుదర్శన్, నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి అందే నాసరయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి, జిల్లా సిపిఐ నాయకులు టిసిహెచ్. చెన్నయ్య కె.వి కృష్ణ గౌడ్, కాసిం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలో నామన శివన్నారాయణ



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: బాపట్ల పట్టణం కారుమూరి హనుమంతరావు నాయుడు కాలనీ కొక్కిరాల రాజేంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 5వ రోజు లలితా త్రిపుర సుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. బాపట్ల జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ అమ్మవారికి చేస్తున్నటువంటి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. జనసేన నాయకులు వీర మహిళలు దుశ్శాలువతో సత్కరించారు. తదుపరి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షు రాలు జిడుగు మాధురి, కల్లి వాసు, శ్రీకాంత్, నామన శ్యామ్, జనసేన నాయకులు,వీర మహిళలు పాల్గొన్నారు.

## నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాలలో 'పొలం పిలుస్తుంది'




పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని నల్లగుంట్ల, కొర్రప్రోలు గ్రామాలలో వ్యవసాయ శాఖ వారు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.జవహర్ లాల్ నాయక్ గ్రామంలో సాగు చేసిన కంది, మిరప పంటలను సందర్శించి కందిలో ఆకు చుట్టు పురుగు, ఏండు తెగులును గుర్తించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నల్లేరు కాషాయం చేయు విధానం, పంటలపై పిచికారీ చేయు విధానం గురించి ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన మల్లునాయక్, ఎన్.జి.ఓ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సెల్ టవర్ నిర్మించరాదంటూ స్థానికుల ఆందోళన




కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలోని శివనగర్ కాలనీ వెంకటేశ్వరా థియేటర్ వెనకవైపు సెల్ టవర్ నిర్మాణానికి మంగళవారం సాయంత్రం యంత్రాలతో పనులు మొదలుపెట్టగా స్థానికులు అడ్డుకొని ఆందోళన చేపట్టారు. పేదలు నివసించే ప్రాంతాల్లో సెల్ టవర్ నిర్మించడం వలన రేడియేషన్ తోటి భయంకరమైన వ్యాధుల బారినపడతామని సెల్ టవర్ నిర్మించడానికి వీలులేదని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో నిర్మాణాలను అడ్డుకొనగా మరల ఎలా వస్తారని నిలదీశారు. సెల్ టవర్ నిర్మిస్తే ఊరుకునేది లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు చొరవ చూపి పేదలు నివసించే ప్రాంతంలో సెల్ టవర్ నిర్మించకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ



కొల్లూరు, మేజర్‌న్యూస్: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను కొల్లూరు మండలంలోని రావి లంక గ్రామంలో 120 కుటుంబాలకు దుస్తులు,నిత్యవసర సరుకులు ఈరే మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ కె.సుధీర్ కుమార్ మంగళవారంపంపిణీ చేశారు.

# నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం: మున్సిపల్ చైర్మన్

కనిగిరి, మేజర్‌న్యూస్: పట్టణంలో నీటి సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చర్యలు చేపడుతున్నట్లు కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని శివారు ప్రాంతాలైన కాశిరెడ్డి కాలనీ, దేవాంగనగర్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటిం చారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని కాశిరెడ్డి కాలనీ, దేవాం గనగర్, టకారి పాలెం ప్రాంతాల్లో వార్డు ప్రజలు నీటి సమ స్య ఏర్పడి చాలా ఇబ్బంది పడుతున్నారని గుర్తించి ఇంటిం టికి పైపులైన్స్ ద్వారా శాశ్వత నీటి పరిష్కారం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో విద్యుత్ అంతరాయం వలన సరియైన సమయాల్లో ప్రజలకు నీరు అందించలేక పోవడం



జరిగిందన్నారు. ప్రస్తుతం విద్యుత్ అంతరాయం లేకుండా 24 గంటలు విద్యుత్ సౌకర్యం ద్వారా ప్రజలకు నీటి సమస్య లేకుండా శాశ్వత పరిష్కారం ఏర్పాటు చేయ డం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సి పల్ ఏఈ కోటేశ్వరరావు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ వాస్తవ్యులు ఆంధ్ర రాష్ట్ర కార్పెంటర్స్ కార్యవర్గ సభ్యులైన కోడూరు వెంకటేశ్వరరావు, ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద ధ్రువీకరణ పత్రాన్ని ఎంపీపీ అందించారు.ఈ సందర్భంగా ఆయన మంగళవారం మాట్లాడుతూ ఇతర దేశాలకు వెళ్లడానికి హిందీ,ఇంగ్లీషు నేర్చుకొని ఉండాలని,బ్యాంకు ద్వారా లక్ష రూపాయల వరకు రుణం పొందవచ్చు న న్నారు.కావున ప్రతి ఒక్క కార్పెంటర్ ఈ ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకమునకు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మల్లేశ్వర



రావులు, వెంకటేశ్వరరావును మండల పరిషత్ కార్యాలయం వద్ద అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏవో జలజ,ఏపీవో శివ పార్వతి,ఏపిఎం జి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

# చండీ, మహాలక్ష్మి అలంకరణలో శ్రీకామాక్షి అమ్మవారు

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: విజయదశమి పండుగ సందర్భంగా మండలకేంద్రమైన సి.ఎస్.పురంలోని శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి శ్రీ కామాక్షి అమ్మవారిని చండీ అలంకరణ చేసి దేవస్థానం అర్చకులు శ్రీకృష్ణశర్మ అధ్వర్యంలో పూజలు చేశారు. అదేవిధంగా ఆరవరోజు మంగళవారం ఉదయం శ్రీకామాక్షి అమ్మవారు చంద్రమౌళీశ్వరస్వామికి పంచామృత అభిషేకం కుం కుమార్చన పూజలు నిర్వహించి అనంతరం అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. తదుపరి ఉభయదాతలచే గణపతి విశేష పూజలు హెూమం నిర్వహించి నైవేద్యం సమర్పించారు. ఈ



సంద ర్భంగా ఆరవరోజు అమ్మవారిని మహాలక్ష్మి అమ్మవారిగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారు స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు భజనలు భక్తిగీతాలతో దేవస్థానం పరిసరాల్లో కోలాహలంగా సందడి నెలకొన్నది.

# ఉద్యాన పంటలపై అవగాహన

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండలంలోని గన్నవరం గ్రామంలో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ పంటలపై మంగ ళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా శిక్షణా సమన్వయకర్త, జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారు యస్.రామ్మోహన్ ముఖ్య అతిధులుగా పాల్గొని మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఎప్పటికప్పుడు సాంకేతిక సమాచారంపై అవగాహన కల్పించుకొని వ్యవసాయం చేయడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకోవలసినదిగా తెలిపారు. రసాయనిక ఎరువులు అవసరము మేరకు మాత్రమే వాడాలని, సేంద్రియ ఎరువుల వినియోగము పెంచుకోవడం ద్వారా పంటల్లో పురుగులు. తెగుళ్ళ ఉధృతి తగ్గుతుందని తెలియజేశారు.




అనంతరం వివిధ పంటల్లో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులపై కరదీపికను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.వి.శేషమ్మ, వెలిగండ్ల మండల వ్యవసాయ అధికారి యన్.రంగ కృష్ణ, వి.ఎ.ఎ.లు తేజస్విని, షేక్ కరీమునీషా, షారుక్, అజరుద్దీన్, జిలాని, రైతులు పాల్గొన్నారు.

# బికెవి గ్రీన్ ఫీల్డ్ రహదారి పనులను తహశీల్దార్ పరిశీలన

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని సీఎస్ పురం సమీపంలో బెంగుళూరు కడప విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ జాతీయరహదారి నిర్మాణపనులను మండల తహశీల్దార్ డి.మంజునాధరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా బికెవి రహదారికి సంభందించి రైతుల భూముల వివరాలు ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం అదేవిధంగా పెండింగులో ఉన్న రైతుల భూములను అడిగి తెలుసుకుని రికార్డులు రూటుమ్యాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా బికెవి జాతీయరహదారికి ప్రభుత్వం అనుమతులు మం జూరు చేసిన చెరువులు కుంటలలో మట్టిని ఉపయోగిం చుకోవాలని అదేవిధంగా అక్రమంగా మట్టితవ్వకాలు జరిపి తే తగిన చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్ల ప్రతిని ధు లకు తెలిపారు. అంతేకాకుండా మండలంలో బికెవి గ్రీన్ ఫీల్డ్ జాతీ



యరహదారి పెండింగులో ఉన్న రైతులకు నష్టప ిరిహారం త్వరితగతిన అందించడానికి చర్యలు తీసు కుంటు న్నట్లు కాంట్రాక్టర్లు మండలంలో బికెవి రహదారి నిర్మాణా నికి సమస్యలు లేకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో తహశీల్దార్ డి.మంజునాధరెడ్డి, నిర్మాణ సంస్థ ప్రతిని ధి గోను శ్రీనివాసులురెడ్డి, రెవెన్యూ సిబ్బంది, రైతులు ఉన్నారు.

## మద్యం అమ్మకటకు ప్రయత్నం చేస్తున్న వ్యక్తి అరెస్ట్



ఉలవపాడు, మేజర్‌న్యూస్: అక్రమ మద్యం సీసాలను కలిగి ఉన్న వాకా గ్రామానికి చెందిన పి.సాంబశివ రావును అదుపులో తీసుకొని అతని వద్దనున్న 30 మద్యం బాటిళ్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఉలవపాడు గ్రామంలోని అలగాయపాలెం రోడ్డు వద్ద మద్యం అమ్మకటకు ప్రయ త్నం చేస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్ఐ అంకమ్మ తెలి పారు.

## శ్రీమహాలక్ష్మీ దేవి అలంకారంలో వల్లూరమ్మ



టంగుటూరు, మేజర్‌న్యూస్: మండలం వల్లూరు గ్రామం నందు వెలసిన శ్రీ వల్లూరమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ వల్లూరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చనలు అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేయటం జరిగినది. దేవి శరన్నవరాత్రులలో భాగంగా శ్రీ వల్లూరమ్మ అమ్మవారు ఆరవ రోజు శ్రీ మహాల క్ష్మీ దేవి అలంకారంలో దర్శనం ఇవ్వడం జరిగినది. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునారు.

## పెద్దమ్మతల్లిని మహాలక్ష్మిగా అలంకరణ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన సి.ఎస్.పురం వి.ఆర్.నగర్ నందు వెలసిన శ్రీరాచూరి పెద్దమ్మ తల్లి దేవస్థానంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు మంగళవారం అమ్మవారిని నగదునోట్లతో మహాలక్ష్మిగా అలంకరణ చేసి దేవస్థానం అర్చకులు గురు చెన్నకేశవ ఆచారి అధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి పంచామృత అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించి అనంతరం హెూమ పూజలు నిర్వహించి మహానైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని పూజలుచేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఉభయదాతలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు రీఫ్రెషర్ ట్రైనింగ్

సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: పంచాయతీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్, డైరెక్టర్ వారి ఆదేశాలు మేరకు సంతనూతలపాడు ఎంపీడీవో ఆఫీస్ నందు ఉప సర్ప ంచులు, ఇద్దరు వార్డు మెంబర్లకు రిఫ్రెషర్ ట్రైనిం గ్ జరిగింది. ఎంపీడీవో సురేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఈఓఆర్డి రమణమ్మ అధ్యక్షత వహించారు. రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు గ్రామ పంచాయతీల విధులు, అధి కారాలు, గ్రామంలో ముఖ్యమైన త్రాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు మొదలైన సమస్యలపై సభ్యులకు పూర్తి అవగాహన కలిగి



ఉండాలని తెలియచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడంగుంట విజయ, పంచాయతీ కార్యదర్శులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు హాజరయ్యారు.

# ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు

**ఎన్డీయే కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల**



ఒంగోలు, మేజర్‌న్యూస్ :ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయొద్దు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, అర్హులందరికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ సూచించారు. నగరంలోని కేబి హొటల్ నందు ఎన్డీయే కూటమి పక్ష సమన్వయ కమిటీ సమావేశం ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో సమన్వయ కమిటీ అధ్యక్షులు, క్లస్టర్, డివిజన్ అధ్యక్షులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయుకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ ఇది ప్రజలు కోరుకున్న మంచి ప్రభుత్వమని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి వారి సంక్షేమాభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 100 రోజులలో పార్టీ నాయకులతో ఒక్క సమావేశం ఏర్పాటు చేసుకొని ఒక్కసారి అందరి అభిప్రాయాలు తెలుసుకుందామని మంగళవారం ఈ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగినది అన్ని తెలిపారు. ప్రతి ఒక్కరు కూడా కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు వివరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకోని వారి సమస్యలు పరిష్కారానికి ప్రతిఒక్కరు పనిచేద్దాం అన్ని తెలిపారు. వచ్చిన 100 రోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పెంచిన పింఛన్లు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, 16,500 టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు, నైపుణ్యాభివృద్ధి సెంటర్ల ఏర్పాటు వంటి 5 ప్రధాన అంశాలపై తొలి సంతకాలు చేశారని ఎమ్మెల్యే జనార్ధన్ గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, నాయకులు కంది రవి శంకర్, బీజేపీ నాయకులు శివారెడ్డ, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్య యాదవ్, మేయర్ సుజాత, మంత్రి శ్రీనివాసరావు, వైవీ సుబ్బారావు, కొఠారి నాగేశ్వరావ, టిడిపి నాయకులు, ఎన్డీఏ కూటమి పార్టీల నేతలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## కదిరి బాబురావు విద్యాసంస్థల్లో ఏటియం గదికి భూమి పూజ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలోని శీలంవారిపల్లె కదిరిబాబురావు విద్యాసంస్థల్లో కెనరాబ్యాంక్ ఏటియం గది నిర్మాణానికి మంగళవారం విద్యాసంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరిపార్ధసారథి బ్యాంక్ అధికారుల సమక్షంలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ కదిరి బాబురావు విద్యాసంస్థలలో ఏటియం ఏర్పాటు చేయడం వలన విద్యార్థులకు సిబ్బందికి నగదు జమ చేయడానికి డ్రా చేసుకునేందుకు అందుబాటులో అదేవిధంగా పరిసర గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటున్నట్లు ప్రజలు ఉపయోగించుకోగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కదిరి పార్థసారధి, కెనరాబ్యాంక్ అధికారులు విశ్వనారాయణ షిండే, సంజయ్ కుమార్ పసయత్, కనిగిరి మేనేజర్ విజయలక్ష్మి, షేక్ బుజ్జి(సర్పంచ్), పలువురు గ్రామస్థులు, విద్యాసంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో పంచాయతీలను అభివృద్ధి చేసుకుందాం



కొమరోలు, మేజర్‌న్యూస్: గ్రామ పంచాయతీ పరిధిలోని అందరూ ప్రజాప్రతినిధులు ప్రజలు సమిష్టిగా కృషిచేసి పంచాయతీల అభివృద్ధి చేసుకుందామని ఎంపీపీ అమూల్య మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఉపసర్పంచ్లు, వార్డు మెంబర్ల శిక్షణా కార్యక్రమంలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి స్థానిక ఈవోఆర్డి డి బ్రహ్మయ్య అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌జిఎస్ఏ రిప్రెషన్ శిక్షణ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పరిధిలోని ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లకు నిధుల సమీకరణ, నిధుల వినియోగం, పారిశుద్ధ్యం, గ్రామపంచాయతీని అభివృద్ధి చేసుకోవడానికి, ఆదర్శంగా ఉండటానికి ఏ రకమైన చర్యలు చేపట్టాలి తదితర అంశాలపై ప్రభుత్వం ఎనిమిది మరియు తొమ్మిది తేదీలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని తలపెట్టినందున, అందులో భాగంగానే నేడు శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరిగిందని తెలియజేశారు. అనంతరం ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ అమూల్య మాట్లాడుతూ పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే సర్పంచి, ఉపసర్పంచి, వార్డు మెంబర్లు మరియు ఇతర ప్రజాప్రతినిధులు అందరూ కలిసి సమిష్టిగా కృషి చేయాలని, అలాగే అభివృద్ధి చేసుకోవడానికి, పంచాయతీని ఆదర్శంగా తయారు చేసుకోవడానికి అందరూ భాగస్వాములుగా వ్యవహరించి, ముందుకు నడిచి ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాల ద్వారా విధివిధానాలను తెలుసుకొని, అవగాహన పెంపొందించుకొని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్లు, పంచాయతీ కార్యదర్శులు, వార్డు మెంబర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ సబ్సిడీలు రైతులకు సకాలంలో అందాలి




తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని పోతలపాడు, గానుగపెంట గ్రామాలలో నిర్వహించడం జరిగినది. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు మిరప, ప్రత్తి పంటలను పరి శీలించడం జరిగింది. ఉడు ముల చిన్నపరెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు మాట్లాడుతూ వ్యవ సాయ, పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం అవలంభించే అన్ని స్కీములు, సబ్సిడీలు రైతులకు సకాలంలో తెలియజేయుట వలన రైతులు ఉపయోగించుకోగలరని సూచించారు. టి.వెంకటేశ్వర్లు మండల వ్యవసాయ అధికారి, డి.శైలజ ఏఓలు మాట్లాడుతూ పంటసాగులో మెలికలు పాటించ డం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని, రసాయనక ఎరువుల వినియోగాన్ని తగ్గించి పంట దిగుబడులు పెరిగేలా రైతులకు అవసరమైన సూచనలు సలహాలు ఇవ్వడమే" పొలం పిలుస్తోంది" లక్ష్యమని తెలిపారు. మాట్లాడుతూ పలు సలహాలు, సూచనలు తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ సౌజన్యలు మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ కింద గడ్డిజొన్న విత్తనాలు పంపిణీ చేయడం జరిగినదని అలాగే వర్షాకాలంలో పశువులలో వచ్చేటటువంటి గాలి కొంటూ, గొంతు వాపు వ్యాధులకు టీకాలు వేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బి.వెంకటేశ్వర్లు నాయక్, మార్కెటింగ్ అధికారి, గ్రామ ప్రజా ప్రతినిధులు కే.బొజ్జయ్య, చెలమయ్య, డిపార్ట్మెంట్

## రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్‌కి ఘన నివాళి



కొండేపి, మేజర్‌న్యూస్: మండలంలోని పెరిదేపి గ్రామానికి చెందిన గంటేనపల్లి జయరావు సోమవారం సాయంత్రం కొండేపి నుండి ఒంగోలు వెళుతుండగా వెంగముక్కలపాలెం సమీపంలో ఉన్నటువంటి భగీరథ కెమికల్స్ ఫ్యాక్టరీ వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు పక్కనే ఉన్నటువంటి గుంతలో పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వైద్య నిమిత్తం ఒంగోలు తరలించగా మంగళవారం రోజు మృతి చెందారు. జయరావు ప్రస్తుతం టంగుటూరు పోలీసు స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న కొండేపి ఎస్సై ప్రేమ్ కుమార్ జయరావు మృతదేహాని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది, ఎఎస్ఐ అంకరావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, అంజి తదితరులు ఉన్నారు.

## నేటి నుంచి పప్పు శనగల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

తర్లుపాడు, మేజర్‌న్యూస్: మండలంలో రబీ సీజన్‌లో సాగు చేయు పప్పు శనగలు నేటి నుండి రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతుందని మండల వ్యవసాయఅధికారిటి, వెంకటేశ్వర్లు తెలియజేశారు. జెజి,-11రకం కొరకు ఈనెల 8 నుండి రైతులకు రిజిస్ట్రేషన్ రైతు సేవ కేంద్రం వద్ద నమోదుచేయడం జరుగుతుందని అన్నారు. శనగ సాగు చేయు రైతులకు ఎకరాకు 40 కేజీల చొప్పున 5 ఎకరాలకు 200 కేజీలు గరిష్టంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. క్వింటా పూర్తి ఖరీదు రూ.9400లు కాగా సబ్సిడీ రూ.2350(25శాతం), రైతు చెల్లించవలసినది రూ.7050లుగా ప్రభుత్వం వారు నిర్ణయించడం జరిగినదన్నారు. మండలానికి 223 క్వింటాల శనగ విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. శనగ పంట వేయాలనుకున్న రైతులు ఆధార్ జిరాక్స్, పట్టాదారు పాస్ బుక్ మరియు ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రం వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

## హర్యానాలో బిజెపి హ్యాట్రిక్ విజయంపై సంబరాలు

గిద్దలూరు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు ముఖ్యఅతిథిగా గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సోదరుడు కృష్ణ కిషోర్ రెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు బిజెపి నాయకులు జిల్లా అధికార ప్రతినిధిజేవి నారాయణ, గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు అప్పిశెట్టి ఉదయ శంకర్, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఖాదర్ వలీ, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి దూదేకుల బాదుల్లా, గిద్దలూరు టౌన్ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కొప్పుల నరసింహులు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ముప్పరి శ్రీనివాసులు అసెంబ్లీ ఎస్‌సి మోర్చా అధ్యక్షుడుబండారి జయప్రసాద్, రామకృష్ణ, మారుతి ప్రసాద్, శ్రీనివాసులు, రవి, రమేష్, కృష్ణ, బిజెపి, టిడిపి, జనసేన నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



## సిగరెట్ హెూల్ సేల్ దుకాణంలో దొంగతనం

**పది లక్షల వరకు సరుకు అపహరణ**

అద్దంకి మేజర్‌న్యూస్: అద్దంకి పట్టణంలో సిగరెట్ హెూల్ సేల్ డీలరు దుకాణంలో దొంగతనం జరిగింది. అర్ధరాత్రి సమయంలో దుకాణ షట్టర్ గడ్డపారతోపైకి లేపి లోపలకు ప్రవేశించిన దొంగలు ఎనిమిది సిగరెట్ దిండ్లు అపహరించుకు వెళ్లారు. వీటి విలువ సుమారు రూ.పది లక్షల వరకు వుంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. అందిన సమాచారం మేరకు నెల్లూరు జిల్లా కావలికి చెందిన వ్యాపారి వైవి.కోటేశ్వరరావు 2012 నుంచి అద్దంకిలో సిగరెట్ హెూల్ సేల్ డీలరుగా పని చేస్తున్నాడు. బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లోని చిల్లర దుకాణదారులకు సిగరెట్లు సరఫరా చేస్తుంటారు. ఈనేపథ్యంలో సోమవారం సాయంత్రం దుకాణం మూసివేసిన అనంతరం షట్టరును మూసిన నిర్వాహకులు మంగళవారం ఉదయం దుకాణం వద్దకు రాగా షట్టరు పైకిలేపి ఉండటాన్ని గమనించారు. ఆమేరకు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ప్రత్యేక పోలీసు బృందాలు దుకాణంలో పరిశీలించారు. దుకాణం వెలుపల, బయట ఉన్న నిఘా కెమేరాల్లో సీసీ ఫుటేజిని పరిశీలించారు. దీని ప్రకారం దొంగతనం జరిగిన సమయం, అపహరించిన సరుకు వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు తమదైన శైళిలో దర్యాప్తు చేస్తున్నారు. దుకాణంలో పని చేస్తున్న వారి చరవాణి నంబర్లు సేకరిస్తున్నారు. సంబంధిత డీలరు నుంచి ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## శ్రీ గజలక్ష్మి దేవి అలంకరణలో కన్యకా పరమేశ్వరి అమ్మవారు



అద్దంకి, మేజర్‌న్యూస్: అద్దంకి పట్టణంలోని శ్రీ చక్ర సహిత శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి దేవాలయములో 53వ దేవి శరన్నవరాత్రి మహెూత్సవ సందర్భంగా ఆరవ రోజు మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీ గజలక్ష్మి దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను పాలకమండలి చైర్మన్ ఊటుకూరు రామకోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులు చిన్ని శ్రీనివాసరావు, ప్రధానకార్యదర్శి అర్వపల్లి హనుమంతరావు, కోశాధికారి నేరెళ్ల శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పోకూరి శ్రీనివాసరావు నేతృత్వంలో సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో అనఘాలక్ష్మి అమ్మవారు



అద్దంకి మేజర్‌న్యూస్: పట్టణంలోనే గాంధీ బొమ్మ సెంటర్ నందుగల ధన్వంతరి దత్త పాదుకా క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆరవ రోజు మంగళవారం అనఘాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ ధన్వంతరీ దత్తాత్రేయ స్వామి వారికి శ్రీ ఉమాసహిత సచ్చిదానందేశ్వర స్వామి వారికి క్షీరాభిషేకం, ప్రాతఃకాల షోడశోపచార పూజ, మాధ్యాహ్నిక షోడశోపచార పూజ, మహానివేదన నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ జరిగింది.సాయంత్రం శ్రీ చక్రసహిత శ్రీ అనఘాలక్ష్మి అమ్మవారికి, ప్రదోషకాలార్చన, షోడశోపచార పూజ, శ్రీలలితా సహస్రనామం, త్రిశతి,దేవి ఖడ్గమాల పారాయణ సామూహిక కుంకుమార్చన,రాత్రి 9 గంటలకు నివేదన, నీరాజన మంత్రపుష్పం, శ్రీ దత్త కాగడ హారతి, ఊంజల సేవ, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. ఉత్సవాలలో ఆరవ రోజు అనఘాలక్ష్మీ అమ్మవారిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వహకులు నాగసూరి హనుమత్ ప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## 'ఫ్రీడం 125 సిఎన్‌జి' బైక్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, షేక్ రియాజ్



ఒంగోలు, మేజర్‌న్యూస్: నగరంలోని తిరుమల బజార్ షోరూం నందు ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ బజాజ్ 'ఫ్రీడం 125 సిఎన్‌జి' బైక్‌ను ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కాలుష్య రహిత వాతావరణం ఉండాలంటే అందరూ సిఎన్‌జి మోటార్ వాహనాలను వినియోగించుకోవాలన్నారు. అదే విధంగా బజాజ్ బైక్ మధ్య తరగతి ప్రజలకు చేరువయ్యే విధంగా ఉంటాయని, ప్రమాద రహితమైన పనిముట్లను సిఎన్‌జిలో నిక్షిప్తమయ్యాయని ఒంగోలు శాసనసభ్యులు కొనియాడారు. అదే విధంగా అందరూ హెల్మెట్ వాడాలని హితవు పలికారు. బజాజ్ కంపెనీ ఏరియా సేల్స్ మేనేజర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచలోనే మొట్టమొదటి సిఎన్‌జి మోటార్ వాహనం తయారు చేసిన ఘనత బజాజ్‌కే దక్కుతుందన్నారు. తిరుమల గ్రూపు యండి కె.శ్రీధర్ మాట్లాడుతూ గత 18సంవత్సరాలుగా తిరుమల బజాజ్‌ను ఆదరించినట్లుగానే ఈ సిఎన్‌జి బైక్‌ను ఒంగోలు జిల్లాలోని ప్రజలందరూ వినియోగించి 50శాతం రోజు వారి ఖర్చును తగ్గించుకునే అవకాశం ఈ బైక్ ద్వారా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి బజాజ్ సబ్ డీలర్లు, ఎఎస్‌ఓలు, మెకానిక్‌లు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్, మెకానిక్ సంక్షేమ సంఘం యూనియన్ అధ్యక్షులు ధర్మా, తిరుమల గ్రూపు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మిదేవిగా పూజలందుకున్న అమ్మవారు



పంగులూరు, మేజర్ న్యూస్: దేవి శరన్నవరాత్రులలో భాగంగా ఆరో రోజు మంగళవారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రమైన పంగులూరులోని భీమలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శ్రీమహాలక్ష్మిదేవిగా పూజలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం వద్ద దేవీ నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. దుర్గ అమ్మవారిని శ్రీ మహాలక్ష్మిదేవిగా పూజలు చేస్తూ ఐదు లక్షల రూపాయల నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని నవరాత్రుల్లో భాగంగా పలు రూపాలలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. చిలుకూరి ప్రసాద్ నాయుడు గోపిరాణి దంపతులు దుర్గా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటుచేసి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. నిత్యం అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించడం కోసం అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతున్నారు. మండలంలోని పలు గ్రామాలలో దేవి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ముప్పారం లోని సాయిబాబా దేవాలయంలో, రేణింగవరం త్రిశక్తి పీఠంలలో నవరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

# విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

### పాఠ్యాంశాల బోధనతో పాటు జనరల్ నాలెడ్జి పెంపొందేలా బోధన ఉండాలి : జిల్లా కలెక్టర్



ఒంగోలు, మేజర్‌న్యూస్: విద్యార్థులకు పాఠ్యాంశాల భోదనతో పాటు జనరల్ నాలెడ్జి పెంపొందేలా బోధన ఉండాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. మంగళవారం ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో జరిగిన మేనేజ్మెంట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రీయ విద్యాలయం పరిస్థితి, 2024-25 సెషన్ కోసం అడ్మిషన్ మార్గదర్శకాలు, తరగతుల వారీగా విద్యార్థుల నమోదు, సిబ్బంది మంజూరు, ఖాళీ పోస్టులు వివరాలు, గత కమిటీ సమావేశం ఎజెండా వివరాలు, తీసుకున్న చర్యలు, ప్రస్తుత కమిటీ సమావేశం ఎజెండా వివరాలు తదితర అంశాలను కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం. మనీష్ కుమార్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు పాఠ్యాంశాల భోదనతో పాటు జనరల్ నాలెడ్జి పెంపొందేలా భోధన ఉండాలన్నారు.

సమాజంలో ఉత్తమ పౌరులుగా జీవించేలా విద్యార్థులను తీరిచిదిద్దాలసిన భాధ్యత మీపై ఉందన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల్లో గ్రూప్ యాక్టివిటీస్‌ను పెంపొందించాలన్నారు. పిల్లల్లో వున్న సృజనాత్మకతను గుర్తించి అందుకనుగుణంగా భోధన వుండాలని జిల్లాకలెక్టర్ సూచించారు. పాఠశాల పక్కనే అందుబాటులో ఉన్న ప్లే గ్రౌండ్ కోసం భూమి కేటాయింపు విషయమై పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో కేంద్రీయ విద్యాలయం కమిటీ సభ్యులు స్టెప్ సిఈఓ లోకేశ్వరరావు, జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డా. సురేష్ కుమార్, ఒంగోలు రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ ప్రకాష్ బాబు, జవహర్ నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి, ఒంగోలు కేంద్రీయ విద్యాలయం రిటైర్డ్ ప్రిన్సిపాల్ సూర్యప్రకాష్‌రావు, ఒంగోలు మునిసిపల్ కార్పోరేషన్ ఇంజనీర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీబాలత్రిపుర సుందరిదేవిని దర్శించుకున్న శిద్ధా దంపతులు

త్రిపురాంతకం, మేజర్‌న్యూస్: త్రిపురాంతకంలోని శ్రీమత్ బాల త్రిపురసుందరిదేవి అమ్మవారిని మాజీ మంత్రి శిద్ధా రాఘవరావు, సతీమణి లక్ష్మీ పద్మావతి మంగళవారం దర్శించుకున్నారు. ముందుగా త్రిపురాంతకంలోని శివాలయంలో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆల యంలోని శ్రీమత్ బాల త్రిపురసుందరి దేవి అమ్మవారి ఆలయంలో అభిషేకం, కుంకుమ అర్చన జరిపించారు. ఆలయ అధికారులు శిద్ధా రాఘవరావు దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు.





## రెండు ఇంద్ర ఏసీ బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే కందుల



పొదిలి, మేజర్ న్యూస్: స్థానిక ఆర్టీసి డిపోకు చెందిన రెండు నూతన ఇంద్ర ఏసి బస్సులను మంగళవారం మార్కాపురం శాసన సభ్యులు కందుల నారాయణరెడ్డి కొబ్బరికాయలు కొట్టి, ప్రత్యేక పూజలు నిర్వహించి లాంచనంగా ప్రారంభించారు. డిపో మేనేజర్ సుందరరావు పచ్చ జెండా ఊపగా ఎమ్మెల్యే కందుల స్వయంగా బస్సు నడిపి పట్టణం లో సందడి చేశారు. ఆర్టీసిలో ప్రయాణం సురక్షితమని ప్రతి ఒక్కరు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించాలని కోరారు. అందరు కలిసి కట్టుగా పని చేసి డిపోను అభివృద్ధి పథంలోకి తీసుకరావాలన్నారు. తొలుత డిపో మేనేజర్ సుందరరావు ఎమ్మెల్యే కందులకు బొకేను అందించి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మండల కన్వినర్ మీగడ ఓబులరెడ్డి, పట్టణ కన్వినర్ ముల్లా ఖుద్దూస్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రసూల్,అధికార ప్రతినిధి షేక్ యాసిన్, టిఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వరికుంట్ల అనిల్, రాష్ట్ర రైతు సంఘ నాయకులు ఆవులూరి ఎలమంద, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎస్‌ఎం బాష, జిల్లా కార్యదర్శి ఎర్రం రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, జిల్లా లీగల్ సెల్ అధికార ప్రతినిధి షేక్ షబ్బీర్, మాజీ సర్పంచ్ ఉలవా గోపి, మాజీ ఎంపిటిసిలు డాక్టర్ ఇమాం సాహెబ్, గాలిముట్టి నరసింహారావు, మాజీ శివాలయం ఛైర్మన్ సామంతపూడి నాగే శ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి కాటూరి శ్రీను, మండల యూత్ అధ్యక్షులు పోపూరి నరేష్ బాబు, ఉద్యోగ సంఘం నాయకులు ముల్లా షరీఫా, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలానీ బాష, కొండాయ పాలెం సర్పంచ్ సన్నెబోయిన సుబ్బారావు, ఎస్సీసెల్ నాయకులు ఠాగూర్ ,నాగేశ్వరరావు, ముక్కెర కిరణ్, మాజీ వార్డు సభ్యులు జ్యోతి మల్లికార్జున, షేక్ షాహిద్, రోళ్ళ శ్రీను, టిడిపి నాయకులు షేక్ మౌలాలి, వీరిశెట్టి సురేష్, బత్తిన ఓబయ్య, షేక్ కాలేషా,అల్లాబకాష్, ముల్లా ఖయ్యూం,కల్లూరి సోమయ్య, సరైనోడు, మహిళా నాయకులు సోమిశెట్టి శ్రీదేవి, షైక్ మొహమ్మద్ , తానికొండ వెంకట్రావు, ముల్లా బుచ్చిబాబు, ఫేక్ అల్లాబక్షు, షైక్ ఖాదర్ వలీ తదితరులు పాల్గొన్నారు.

# గిద్దలూరు అభివృద్ధికి చొరవ చూపండి

వెనుకబడిన నియోజకవర్గంగా ప్రకటించాలి

ప్రత్యేక రాయితీలు, నిధులను కేటాయించాలి

నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి

మార్కాపురంలో ఆసుపత్రిని గిద్దలూరు ప్రాంతానికి మార్చాలి

ఆర్మీ పిల్లలకు సైనిక్ స్కూల్‌ను ఏర్పాటు చేయాలి

స్వర్ణాంధ్ర - 2047 విజన్ వర్క్ షాప్‌లో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గళం

సొంత నిధులతో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా :ఎంపి మాగుంట



ఒంగోలు, మేజర్‌న్యూస్: గిద్దలూరు నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపాలని ఆయా శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం ప్రకాశం భవనంలో జరిగిన స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధన రివ్యూ సమావేశంలో పాల్గొన్న ఆయన గిద్దలూరు నియోజకవర్గంకు సంబంధించిన పలు అంశాలు, సమస్యలపై విపక్ష ఎమ్మెల్యేలా గళమిప్పారు. ప్రకాశం జిల్లాలో అత్యధికంగా వెనుక బడిన నియోజకవర్గం గిద్దలూరు ప్రాంతం అన్నారు. గిద్దలూరు నియోజకవర్గంపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపించాలి. గిద్దలూరులో జిల్లా ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిని ఏర్పాటుచేయాలి, మా ప్రాంత ప్రజలు ఎద్దైన ప్రమాద జరుగుతే వందల కిలో మీటర్ల దూరంలో ఉన్న ఆసుపత్రులకు వెళ్ళాలన్నారు. మార్కాపురంలో మెడికల్ కాలేజి ఉంది, అక్కడ జిల్లా ఆసుపత్రి అవసరం లేదన్నారు. మార్కాపురం జిల్లా ఆసుపత్రిని గిద్దలూరుకు మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఒక ప్రాంతం అభివృద్ధి చెందాలంటే వ్యవసాయం రంగం, విద్యా రంగం అవసరం, కానీ గిద్దలూరు నియోజకవర్గంలో ప్రస్తుత పరిస్థితులు దూరంగా ఉన్నాయన్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో వెలుగొండ ప్రాజెక్టు నీళ్ళు ప్రతి ఎకరాకు నీరు పారాలి, ప్రతి రైతు మొహంలో చిరునవ్వు చూడాలనలేదని నా కొరిక రైతు బాగంటే ఆ కుటుంబం ఆ ఊరు మన దేశం బాగుంటుందన్నారు. ఇక గిద్దలూరు నియోజకవర్గంలో ఎక్కువ మంది సైనికులు ఉన్నారు. వాళ్లు ఈ దేశ సేవలో పరితపిస్తున్నారు. అలాంటి సైనికుల పిల్లలకు సైనికస్కూల్ గిద్దలూరులో ఏర్పాటు చేయాలని ఎంపీ మాగుంటను కోరారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి అడిగిన సైనిక స్కూల్ ప్రశ్నకు ఎంపి మాగుంట మాట్లాడుతూ సొంత నిధులతో ప్రైవేట్ స్కూల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో మాగుంటకు ముత్తుముల ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో గిద్దలూరు నియోజకవర్గంలో వికలాంగుల పింఛన్స్ భారిగా అవినీతి జరిగింది. అధికారులు వెంటనే వేరిఫై చేసి నిజమైన అర్హులకు పింఛన్లు అందించాలన్నారు. నియోజవర్గంలో ఎక్కువగా ఫేక్ పత్రాలతో ఫించన్లు తీసుకుంటున్నారు. ఎవరైతే అక్రమాలకు పాల్పడారో అధికారులు వారిపై చట్ట రిత్యా చర్యలు తీసుకొవాలి, నిజమైన అర్హులకు న్యాయం జరగాలని సమావేశం దృష్టికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తీసుకెళ్లారు.

# ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసిన ఫారెస్ట్ అధికారులు: ఇద్దరు పరారు





పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: నల్లమల అరణ్యం పెద్ద దోర్నాల అటవీ శాఖ రేంజ్ పరిధి చిలకచర్ల బోడుగూడెం అటవీ ప్రాంతంలో అలుగు (పంగోలిన్)ను వేటాడి అమ్మకానికి సిద్ధమైన ఐదుగురు సభ్యులుగల ముఠాలో దోర్నాల అటవీ రేంజ్ అధికారులు ముగ్గురిని పట్టుకొని అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారైనట్లు ఫారెస్ట్ అధికారులు ఎస్కే మునీర్, నాయబ్ రసూల్ మంగళవారం తెలిపారు. పరారైనవారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో పెద్ద దోర్నాల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన మాండ్ల పెద్దన్న, సుందరయ్య కాలనీకి చెందిన మందా బాబురావు, జమ్మి దోర్నాలకు చెందిన చాట్ల దానమయ్యలు ఉన్నారు. పరారైన వారిలో పెద్దారవీడు మండలం ప్రగల్లపాడుకు చెందిన కుడుములు బయన్న, చిలకచర్ల బోడుగూడానికి చెందిన దాసరి బుడ్డన్న ఉన్నట్లు డిఆర్‌ఓ నాయబ్ రసూల్, ఎఫ్‌ఎస్‌ఓ మునీర్ తెలిపారు. నల్లమల అడవిలో వేటాడిన అలుగును దళారుల ద్వారా అమ్మకానికి పెట్టినట్టు ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు అందిన సమాచారం మేరకు చిన్న గుడిపాడు వద్ద ఆర్టిటి కార్యాలయం వద్ద అనుమానముగా ఉన్న కొందర్ని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా తీగ లాగితే డొంక కదిలింది. చల్లకచర్లకు చెందిన దాసరి బుడ్డన్న వేటాడిన అలుగును కొత్తూరుకు చెందిన మాండ్ల పెద్దన్న ద్వారా అమ్ముకునేందుకు ప్రయత్నం సాగించారు. మాండ్ల పెద్దన్న ప్రగల్లపాడుకు చెందిన కుడుముల బయన్న ను సంప్రదించి అలుగును అమ్మి పెట్టమని అప్పగించాడు. దీంతో కుడుముల బయన్న వద్దకు మంద బాబు రావు, చాట్ల దానమయ్యలు వెళ్లి బేరసారాలు కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో అదుపులోకి తీసుకున్న నిందితుల నుండి వారి ఫోన్ కాల్ డేటా ద్వారా అక్రమ రవాణా గుట్టు వ్యవహారం ఫారెస్ట్ అధికారుల విచారణలో బయట పడ్డట్టు ఫారెస్ట్ అధికారులు తెలిపారు. ఇద్దరు నిందితులు పట్టుపడితే గాని అలుగు ఎక్కడున్నది? దీని స్మగ్లింగ్ వెనక ఎవరు ఉన్నది పూర్తి సమాచారం వచ్చే అవకాశం ఉంది. ప్రగళ్లపాడుకు చెందిన వ్యక్తి అలుగును కోసుకొని వండుకు తిన్నట్లు తెలిపాడని, అలుగు తమ స్వాధీనంలో లేదని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. మిగతా ఇద్దరు నిందితులు ఫారెస్ట్ అధికారులకు పట్టుబడితే అలుగు స్మగ్లింగ్ వ్యవహారం పూర్తిగా బయటపడుతుంది. ఏది ఏమైనాప్పటికీ గత వారం రోజులుగా ఫారెస్ట్ అధికారులు వన్య ప్రాణుల వేటాడుతున్న వ్యక్తుల కోసం విస్తృతంగా గాలిస్తున్నారు.

ఇది ఇలా ఉండగా వైద్య శాస్త్రంలో అలుగుకు ఎంతో ప్రాధాన్యత ఉంది. దీర్ఘకాలిక రోగాలకు, శక్తి సామర్థ్యాలకు అలుగు ఎంతో ప్రయోజనకారిఅని, వైద్యం పేరుతో కొందరు వాటిని యదేచ్ఛగా వేటాడుతూ ఆ జాతి ఆనువాలు లేకుండా చేస్తున్నారు. పర్యావరణ సమతుల్యానికి వన్య ప్రాంతంలో ఎంతగానో ఉపయోగపడతాయి. జీవకోటికి పర్యావరణానికి ఉపయోగపడే వన్య ప్రాణులు స్మగ్గర్ల చేతిలో బలి అవడం దురదృష్టం వన్యప్రాణి సంపదను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## గుండమాలలో 'పొలం పిలుస్తోంది'




కొత్తపట్నం, మేజర్‌న్యూస్: గుండమాల గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ద్వారా ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాల గురించి మస్త్య సహాయకులు డేవిడ్ తెలిపారు. గుండమాల గ్రామం నందు మొత్తం 132 బోట్లు రిజిస్టర్ చేయబడి ఉన్నవి, అందులో మోటరైజ్డ్ 96 నాన్ మోటర్ 36 బోట్లు, అందులో 86 హెచ్‌ఎస్‌డి ఆయిల్ కార్డ్స్ ఇవ్వబడి ఉన్నాయి. లీటరుకి రూ.9లు సబ్సిడీ ఇవ్వబడుతుంది, ఆ విధంగా ఒక కార్డు మీద 300 లీటర్లు తీసుకోవచ్చు, 684 యాక్టివ్ ఫిషర్ మెన్ ఉన్నారు. వేట చేసుకొనుచు ఆకస్మికంగా మరణించిన యానాది అనే వ్యక్తికి 10లక్షల రూపాయలు జమచేయబడినవి. 151 మత్స్యకార పెన్షన్లు పొందుతున్నారు 14 మందికి కేసిసి లోన్స్ కింద రూ.2,80,000లు ఇవ్వడం జరిగింది. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద గుండమాల గ్రామం నుండి ఐదు బోట్లు సబ్సిడీ కింద తీసుకోవడం జరిగింది. ఫిష్ ఆంధ్ర షాపు కింద రూ.1,16,151లు లోను రూపంలో ఇవ్వబడింది. అందులో సబ్సిడీ క్రింద రూ.46,460లు తీసుకోవడం జరిగింది. గుండమాల గ్రామం నందు ఆక్వా సాగులో 32 మంది రైతులు 74 ఎకరాల్లో సాగు చేసుకుని చున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి, ఉద్యానాది కారి తేజ, పశుసంవర్ధక సహాయకులు వినయ్, వ్యవసాయ విస్తరణ అధికారి అజయ్, నవ్య, కరిముల్ల, సాగర మిత్రలు, మత్స్యకారులు, రైతులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్లిన సిబ్బందికి సన్మానం



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: స్థానిక మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ గాయం సావిత్రి రెడ్డి పాల్గొని మాట్లాడుతూ అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులను ప్రజలు స్థిరస్థాయిగా గుర్తుంచుకుంటారని వారి సేవలను కొనియాడారు. అనంతరం పి.మధుసూదన్‌రెడ్డి, ఎస్.రఘురాం కుమార్, కెవి కృష్ణారావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గాయం బలరాం రెడ్డి, వైసీపీ కన్వీనర్ యక్కటి శ్రీనివాసులరెడ్డి, సర్పంచులు కత్తి రాజారావు, గాలం రామకృష్ణ, భవనం కృష్ణారెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు సానికొమ్ము మధు సూధన్ రెడ్డి, పి.శ్రీనివాసులు రెడ్డి, జి.ఆదినారాయణ రెడ్డి, పరిసపోగు గురు ప్రసాద్, శ్యామల, సాంబిరెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవ్యవస్థలో మహిళలకు సమాన న్యాయం

కొత్తపట్నం, మేజర్‌న్యూస్: న్యాయం వ్యవస్థలో మహిళలకు సమానమైన అవకాశాలు ఉన్నాయని వాటిని గుర్తించి తమ న్యాయపరమైన హక్కులు పొందాలని సీనియర్ న్యాయవాది కాట్రగడ్డ అరుణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ ఆవరణలో వెలుగు కార్యాలయంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'విధాన్ సేసమాధాన్' అనే కార్యక్రమంలో భాగంగా మహిళలకు నిర్వహించిన న్యాయవిజ్ఞానసదస్సులో పాల్గొన్నారు. సీనియర్‌న్యాయవాది ఎన్.ధనలక్ష్మి మాట్లాడుతూ పని ప్రదేశాలలో మహిళల పట్ల జరుగుతున్న లైంగిక దోపిడీ గురించి వాటి నివారణ కోసం యాజమాన్యాలు ఏర్పాటు చేయవలసిన సంఘాల గురించి బాల్యవివాహాలు వలన వచ్చే అనర్థాల గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మహిళలకు అందించే ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు.

## కనీస వేతనాలు అమలుకు చొరవ చూపండి

### జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కు ఆర్డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యూఎస్ స్కీం వర్కర్లు వినతి

ఒంగోలు, మేజర్‌న్యూస్ : కనీస వేతనాలు అమలుకు చొరవ చూపాలని ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్‌కు ఆర్డబ్ల్యూఎస్, సిపిడబ్ల్యూఎస్ స్కీం వర్కర్లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఆంధ్ర ప్రదేశ్ ఆర్డబ్ల్యూఎస్ అండ్ సిపిడబ్ల్యూఎస్ స్కీం వర్కర్స్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున ఆధ్వర్యంలో రియాజ్‌కు సమస్యలను వివరించారు. కార్మికుల, న్యాయమైన డిమాండ్‌ను, కనీస వేతనాలను, ప్రకాశం జిల్లాలో అమలు చేయడం లేదని జిల్లా మొత్తం రక్షిత మంచినీటి పథకాల ద్వారా ఎన్నో ఏండ్లుగా మంచినీళ్లు అందిస్తూ ఉన్నామని, అయితే ప్రజలకు మంచినీరు అందిస్తూ కార్మికుల కుటుంబాలు మాత్రము కన్నీరు తాగుచున్నామని, ఈ విషయం లో చొరవ చూపి ప్రకాశం జిల్లాలో కార్మికులందరికీ ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం కనీస వేతనాలు ఇప్పించాలని ఈ విషయం మన గ్రామీణాభివృద్ధి శాఖ, రూరల్ వాటర్ సప్లై, పంచాయతీరాజ్ శాఖా మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించాలని జిల్లా నాయకులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రియాజ్‌ని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మయ్య, సుబ్బారావు, శ్రీకాంత్, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు తీవ్ర అన్యాయం




కనిగిరి, మేజర్‌న్యూస్: ఎస్సీ వర్గీకరణ ద్వారా మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మాల సంఘాల జెఏసి కన్వీనర్ పాలేటి కోటేశ్వరావు అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం సమీపంలో మాలల చైతన్య కార్యక్రమం నియోజకవర్గ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాలేటి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నాయని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే రాబోయే తరాలకు చాలా నష్టం జరుగుతుందన్నారు. మాలలు ఐక్యమత్యంగా ఉండి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేఖంగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు చదలవాడ బాల గురవయ్య, మాలల ఐక్యవేదిక కార్యదర్శి కలవకూరి శాంతరాజు, కనిగిరి బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు యరజాల బాల నారాయణ, బిటిఏ నాయకులు పాపబత్తిని నాగేశ్వరరావు, యల్నాటి మల్లికార్జునరావు, మురహరి వెంకటేశ్వర్లు, కుడారి కొండయ్య,జొన్నలగడ్డ పరుశురాం, గండూరి మధు, జొన్నలగడ్డ ధర్మేందర్ ,జనుమాల సుభాష్, జనుమాల విశ్వనాథ్, కనిగిరి నియోజకవర్గం వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు కొటికల బాల బాదుర్ల, కార్యదర్శి కోటపాటి రమణ, సహాయ కార్యదర్శి దమ్ము శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీలో నాన్ టీచింగ్ పోస్టులకు మూడు ఖాళీలు

కొత్తపట్నం, మేజర్‌న్యూస్: కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొత్తపట్నం మండలం సంబంధించి మూడు నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారిని 2 పద్మావతి తెలిపారు. హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ ఈ మూడు పోస్టులుకు అభ్యర్థులు ఆన్లైన్లో ఏడో తేదీ నుండి 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకొని ఎంఈఓ కార్యాలయానికి అందజేయాలన్నారు. 1.7.2024కు 42 సంవత్సరాలు నిండి ఉండరాదు అన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15వేలు గౌరవవేతనం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఎక్స్ సర్వీస్ మెన్ అభ్యర్థులకు 52 సంవత్సరాలు వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులందరూ తప్పనిసరిగా మహిళలు మాత్రమే ఉండాలి. 16న మండలాల వారీగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల జాబితా సిద్ధం చేయటం, 17న సమగ్ర శిక్ష కార్యాలయానికి అందించడం, 18న జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు తెలియ పరచడం, 21న జిల్లా సెలక్షన్ కమిటీ జాబితాను పరిశీలించడం, 22న ఎంపికైన అభ్యర్థులు జాబితా ప్రకటించి వారికి నియామక ఉత్తర్వులు ఇవ్వడం జరుగుతుందని ఎంఈఓ పద్మావతి తెలిపారు.

## ఐ.ఈ.సి అవగాహన సదస్సు



కొరిశపాడు, మేజర్‌న్యూస్: ప్రముఖ చర్మ, హెచ్ఐవి వైద్య నిపుణులు ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ హెచ్ఓడి డాక్టర్ బి.బాలాజీ నాయక్, ప్రముఖ స్త్రీ వైద్యుని నిపుణులు, బాలాజీ స్కిన్ అండ్ మల్టీ స్పెషల్ హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిరణయి వారి సహాయ సహకారాలతో హెచ్ఐవి ఎయిడ్స్ బాధితులకు హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.వి.సాగర్ బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా ఐఈసి అవగాహన భాగంగా మంగళవారం నిరుపేద హెచ్ఐవి, ఎయిడ్స్ బాధితులకు నిత్యవసర సరుకులు పౌష్టికాహారం అందించే కార్యక్రమం ముఖ్యఅతిథిలుగా పాల్గొన్న అద్దంకి రూరల్ సిఐ డి.మల్లికార్జునరావు, మేదరమెట్ల ప్రాథమిక వైద్యశాల వైద్య అధికారిణి డాక్టర్ నిఖిలారెడ్డి పాల్గొన్నారు. అద్దంకి సీఐ, ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ హెచ్ఓడి డాక్టర్ బి.బాలాజీ నాయక్, అద్దంకి రూరల్ సీఐ డి.మల్లికార్జునరావు, బాపట్ల జిల్లా హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ ఒంగోలు రిమ్స్ హాస్పిటల్ హెచ్వోడి డాక్టర్ బి.బాలాజీ నాయక్, వారి సతీమణి స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ కిరణ్మయి, వైద్యారోగ్య శాఖ వైద్య అధికారిని డాక్టర్ నిఖిల రెడ్డి, హెల్ప్ టిఐ ఏఎన్ఎం రాధా, ఔట్రిచ్ వర్కర్లు కరుణ, మల్లేశ్వరి, దుర్గ, శ్రావణి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది'



బల్లికురవ, మేజర్‌న్యూస్: మండలంలోని గుంటుపల్లి, బల్లికురవ గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ అధికారి కుమారి తెలిపారు ఈ కార్యక్రమానికి సహాయ వ్యవసా య సంచాలకులు మార్టూరు కె.శ్రీనివాస రావు హాజరై రైతుల కు పలు సూచనలు చేశారు. వరి, మొక్కజొన్నలో జింక్ లోపం ప్రధానంగా కనిపిస్తుందని, దీనిని సరిచేసుకో వడానికి దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ వేసుకోవాలని సూచించారు.అలాగే మొక్కజొన్న లో కాండం తొలిచే పురుగు, కత్తెర పురుగు నివారణ చర్యలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖ సహాయకులు, ఎఇఓ వంశీ, వివిఎ ప్రవీణ్ పాల్గొన్నారు.

## ఎస్ఐ అజయ్ బాబును సత్కరించిన దళిత నాయకులు



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: సంతనతలపాడు నూతన ఎస్ఐగా పదవి బాధ్యతలు చేపట్టిన వేజెండ్ల అజయ్ బాబును మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు దళిత నాయకులు మర్యాదపూర్వకముగా కలిసి శాలువా కప్పి ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అభినందించిన వారిలో నాయకులు కోతి కోటేశ్వరరావు, అట్లూరి అశోక్బాబు, సాదు కొండలరావు, చేజర్లయ్య తదితరులు ఉన్నారు.

## ఈ-పంట నమోదుపై పంటభూముల తనిఖీ



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ఇటీవల వ్యవసాయ సిబ్బంది నమోదు చేసిన ఈపంటకు సంభందించి పంట భూములను మండల తహశీల్దార్ డి.మంజునాథరెడ్డి తనిఖీ చేశారు. మంగళవారం మండలంలోని వెంగన గుంట, పెదగోగులపల్లె, సిఎస్ పురం గ్రామాల్లో ఈపంట నమోదు చేసిన రికార్డులపరంగా క్షేత్రస్థాయిలో పంట భూములను తహశీల్దార్ పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఈపంట నమోదు చేయించుకున్న రైతులతో మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితులు ప్రకృతి విపత్కర పరిస్థితుల్లో రైతులు వేసుకున్న పంటకు నష్టం చేకూరినపుడు ఈపంట నమోదు చేసిన రైతులకు పంట నష్టపరిహారం ప్రభుత్వం అందిస్తుందని ప్రతిరైతు పంటలు వేసినప్పుడు వ్యవసాయ సిబ్బంది ద్వారా ఈపంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంట వ్యవసాయ సహాయకులు రామశారద, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## వావిలేటిపాడు గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో సందర్శన

జరుగుమల్లి, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని వావిలేటిపాడు గ్రామంలో ఉన్న సచివాలయంకు మంగళవారం ఎంపీడీవో ఎం.రమణమూర్తి సందర్శించారు. అయితే తొలుత సచివాలయం సిబ్బంది రిజిస్టర్లను పరిశీలించారు గృహాలు ఈ గ్రామాల్లో ఎన్ని మంజూరైనాయి ఎన్ని పెండింగ్లో ఉన్నాయి. ఎంతమందికి బిల్లులు వచ్చాయి. ఎంతమందికి రాలేదు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ కార్యక్రమాలు చేపడుతున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఆరోగ్య ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు దృష్టిలో పెట్టుకోవాలన్నారు. జ్వరాలు సోకి ఉంటే వారి వద్ద నుంచి రక్త నమూనాను సేకరించాలన్నారు.

# చేతి వృత్తుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన నాగేశ్వరరావు



యర్రగొండపాలెం, మేజర్‌న్యూస్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జి ఎనుముల నాగేశ్వరరావు మంగళవారం శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు చేతివృత్తుల వారికి విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దానిని అమలు చేసే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో నియోజకవర్గ కేంద్రమైన ఎర్రగొండపాలెంలో ఈ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు విశ్వకర్మ యోజన దరఖాస్తుదారులు అందరు కూడా పుల్లలచెరువు రోడ్ షీలా స్కూల్ నందు తమ దరఖాస్తులను అందజేసి ప్రభుత్వం అందించే విశ్వకర్మ యోజన పథకం ద్వారా శిక్షణ పొంది అభివృద్ధి చెందేందుకు ఎంతో దోహదపడుతుందని ఈ అవకాశాన్ని పేద మధ్యతరగతి కుటుంబాల వారు దరఖాస్తు చేసుకొని ఈ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొంది ఈ శిక్షణ కేంద్రాన్ని సందర్శించవచ్చిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ ఎనుముల నాగేశ్వరరావు దరఖాస్తుదారులను కోరారు ఈ శిక్షణ కేంద్రంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకొని నాగేశ్వరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రగొండపాలెం మండల పార్టీ అధ్యక్షులు మాదాల సూర్యనారాయణ, సీనియర్ నాయకులు బాదరయ్య గౌడ్, నాగచారి ప్రతాప్ రెడ్డి, అశోక్ కుమార్, లోకేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజలక్ష్మీ అలంకరణలో భైరవకోన అమ్మవారు



సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పర్యాటక శైవక్షేత్రమైన భైరవకోనలో విజయదశమి పండుగ సందర్భంగా దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆరవ రోజు మంగళవారం శ్రీత్రిముఖ దుర్గాంబ అమ్మవారిని గజలక్ష్మీగా అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీత్రిముఖ దుర్గాంబ అమ్మవారికి కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వరస్వామివార్లకు పంచామృత అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని గాయత్రీదేవి అలంకరణ చేసి దేవస్థానం అర్చకులు కె.వెంకటనరసయ్య, పి.రామ్మూర్తిశర్మ, సుధాకరశర్మల అధ్వర్యంలో అర్చకబృందం వివిధ హోమ పూజలు నిర్వహించి అనంతరం నైవేద్యం సమర్పించారు. ఈ పూజా కార్యక్రమంలో ముప్పాళ్ల శ్యామసుందరరాజు, పలువురు ఉభయదాతలు, అర్చకబృందం, భక్తులు పాల్గొని అమ్మవారు స్వామివార్లను దర్శించుకుని పూజలుచేసి మహానైవేద్యం సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దేవస్థానం ఇఓ వంశీకృష్ణారెడ్డి సూచనలతో సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

# ప్రకృతి వ్యవసాయానికి రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కొలచనకోట, మల్లవరం గ్రామాల్లో మంగళవారం పోలం పిలుస్తుంది రా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కె.రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రమేష్ బాబు మాట్లాడుతూ రైతులందరూ తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం వైపు ముగ్గు చూపాలని తెలిపారు. అనేక సంవత్సరముల నుంచి భూమికి వాడిన పురుగు మం దులు వాడటం వలన భూమి నిస్సారంగా మారి చౌడు భూములుగా మారాయి. దీనిని నివారించుటకు భూమిలో ఎకరానికి రెండు టన్నుల పశువులు ఎరువులు వాడాలని తెలిపారు. పలు రకాల పంటలకు వాటి చీడ తెగుళ్ళకు కార ణాలు, వాటి నివారణకు మార్గాలు తెలిపారు. అనంతరం జడ్పీఎన్ఎఫ్ పథకం కింద గ్రామాల రైతులకు కూరగాయ విత్తనాలు పొద్దుటూరు పంట విత్తనాలు ఉచితంగా అం దించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు డొక్కా మరియమ్మ, సుబ్బారెడ్డి, ఎంపీటీసీ బోయపాటి వీరా ంజనేయులు, ఏఈఓ శేషయ్య, వీఐఏలు సిహెచ్ రామేశ్వర్, హరితేజ, రెండు గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్, వార్డు మెంబర్లకు శిక్షణా తరగతులు ప్రారంభం



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని ఉప సర్పంచ్లకు, వార్డు నెంబర్లకు మంగళవారం శిక్షణా కార్యక్రమం మండల పరిషత్ సమావేశం మందిరంలో ప్రారంభమైంది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపీపీ వాకా అరుణా కోటిరెడ్డి పాల్గొని గ్రామాలను పక్క ప్రణాళికతో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించుటకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలి అన్నారు. గ్రామాల అభివృద్ధిలో ఉపసర్పంచులు వార్డు నెంబర్లు కీలకపాత్ర అన్నారు. జలజీవన్ మిషన్ ప్రాజెక్టు మేనేజర్ డి.సుధీర్, జిల్లా సమన్వయకర్త కేశవరావు పాల్గొని ఇంటింటికి మంచినీళ్లు సరఫరా చేసే ఉద్దేశంతో ఈఈ ప్రాజెక్టును అన్ని గ్రామాల్లో ప్రారంభించామన్నారు. త్వరలో ప్రతి ఇంటికి కొళాయి కనెక్షన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండలంలోని గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉప సర్పంచ్లు ప్రతి గ్రామం నుంచి ఇద్దరు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## మంతెనవారిపాలెం గ్రామ పంచాయితీలో కొత్త కరెంటు స్తంభాలు ఏర్పాటు



పిట్టలవానిపాలెం, మేజర్‌న్యూస్: మండలంలోని మంతెనవారిపాలెం గ్రామ పంచాయితీ లో కొత్త కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. పిట్టలవానిపాలెం మండలం మంతెన వారి పాలెం గ్రామ పంచాయితీ లో ఎప్పుడో వేసిన పోల్స్ వల్ల లైన్స్ కిందకి వేలాడి గ్రామ ప్రజలకు ఎంతో సమస్యగా ఉంటుందని గ్రామ ప్రజలు బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాల మేరకు వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించటం జరిగిందని మండల విధ్యుత్ శాఖ ఏ.ఇ కె.చంద్ర శేఖర్ అన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మద్దిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలో ఏడుగుండ్ల పాడు-వెంకటరాజు పాలెం మధ్యలో గల ఐశ్వర్ షోరూం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. హైవే పోలీసుల కథనం ప్రకారం సోమవారం రాత్రి 11 గంటల 30 నిమిషాల సమయంలో గుంటూరు వైపు నుంచి ఒంగోలు వెళ్ళు మార్గంలో ఏడుగుండ్లపాడు-వెంకటరాజు పాలెం మధ్యలో గల ఐషర్ షోరూమ్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిని వివరాలు తెలియాల్సి ఉంది. మద్దిపాడు ఎస్సై శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మహా చండీ అవతారంలో అమ్మవారు



మార్టూరు, మేజర్‌న్యూస్: మండలంలోనే నాగరాజుపల్లి గ్రామంలో దసరా శరన్నవరాత్రులలో భాగంగా మంగళవారం శ్రీగంగా పార్వతీ సమేత నాగలింగేశ్వర స్వామి ఆలయంలో మహా చండీ దేవి అవతారంలో అమ్మవారు ప్రత్యేక అలంకరణతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## దాసళ్ళపల్లిలో 'పొలం పిలుస్తుంది'



హనుమంతునిపాడు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కూటా గుండ్ల రైతు సేవ కేంద్రం పరిది లోని దాసళ్ళ పల్లిగ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం వ్యవసాయ అధికారి కె.వి. రమణ ఆధ్వర్యంలో నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కంది, నిమ్మ చెట్లలో ఉన్న సమస్యలను తెలుసుకొని వాటికి సంబంధించిన జాగర్త చర్యలు తీసుకో వాలని కోరారు వ్యవసాయ రంగంలో ఎన్నో మెలకువలను తీసుకొని తెగుళ్లపై అవగాహన కలిగి ఉండాలని అవసరమైన సమయంలో అధికారుల సూచన లు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్ర మంలో అర్టికల్చర్ ఆఫీసర్అంజలి ఎంఐఏఓ పి.సత్య ప్రసాద్, ఎంపీఈవో అక్రం, దాసల్లపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు గట్ల కృష్ణారెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, కుందూరు తిరుపతి రెడ్డి, ఎల్లావుల శ్రీను, రమణారెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, వెంకటనారాయణ పాల్గొన్నారు.

## పశు వైద్యశాలను పరిశీలించిన రమేష్



మార్టూరు, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కొలలపూడి పశు వైద్యశాలను జిల్లా అధికారి డాక్టర్ రమేష్ మంగళవారం పరిశీలించారు. ప్రస్తుత బిల్డింగ్ ముందు శిథిలావస్థకు చేరిన పాత బిల్డింగ్‌ను పరిశీలించారు.పాత బిల్డింగు పడగొట్టి,చదును చేయుటకు జిల్లా అధికారులు అనుమతి మంజూరు చేయమని సర్పంచ్ ఎం.సతీష్ కుమార్, గ్రామస్థులు కండిమల్ల రామకోటేశ్వరవు, రంగబాబు, వీరంజనేయులు, తిరుపతి, రాంబాబు కోరగా, మీరు రాత పూర్వకంగా లెటర్ ఇస్తే అనుమతి ఇస్తాను అన్నారు. ఆసుపత్రి అభివృద్ధికి డాక్టర్ మధులత కొన్ని సూచనలు చేశారు. వైద్య సిబ్బంది అశ్వనీ, హేమంత్, రైతులు పాల్గొన్నారు.

# సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం




బల్లికురవ, మేజర్‌న్యూస్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశమున్నా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. పలు శాఖల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. సమావేశం ప్రారంభమయ్యాక కూడా అధికారుల, ప్రజాప్రతినిధుల రాక కొనసాగింది. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు ఎవరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకురాలేదు. స్థానిక బల్లికురవ తెలుగుదేశంపార్టీ వార్డు సభ్యురాలు పావులూరి దుర్గ మాట్లాడుతూ స్థానిక బల్లికురవలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టినప్పటి నుండి ఎటువంటి పంచాయతీ సమావేశాలు బల్లికురవ గ్రామంలో జరగలేదంటూ, జరిగి ఉంటే ఎటువంటి సమాచారం వార్డు నెంబర్లకి చెప్పట్లేదు అంటూ మండిపడ్డారు. గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకులు మల్లినీడి గోవిందరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, ఎంపీడీవో కుసుమకుమారి, సర్పంచులు, ఎంపీటీసీలు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత:ఎంపిడిఓ



పంగులూరు, మేజర్ న్యూస్: గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత నిచ్చి సమస్యలు లేని గ్రామ పంచాయతీలను నిర్మిద్దామని ఎంపీడీవో కే.స్వరూప రాణి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండలంలోని గ్రామ ఉప సర్పంచులు, వార్డు నెంబర్లు జరిగిన శిక్షణ తరగతుల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే గ్రామపంచాయతీలు పరిశుభ్రంగా ఉండాలని ఆమె తెలిపారు. గ్రామాల్లో మంచినీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, పరిసరాల పరిశుభ్రతను కల్పించినప్పుడు గ్రామాల్లో సమస్యలే ఉండవని తెలిపారు. గ్రామపంచాయతీ సమావేశాలకు సర్పంచ్ తో పాటు, సెక్రెటరీ, ఉపసర్పంచి, వార్డు మెంబర్లు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. పంచాయతీ నిర్మాణంలో వార్డు మెంబర్లు, ఉపసర్పంచిల పాత్ర కీలకమైందని ఆమె చెప్పారు. ఆ సమావేశంలో తీసుకునే నిర్ణయాలే గ్రామపంచాయతీ అభివృద్ధికి బాటలు వేస్తాయని ఆమె తెలిపారు. ఈ ఓ ఆర్ డి సుమంత్ మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులను సక్రమంగా అభివృద్ధి పనులకు ఖర్చు పెట్టడంలో ఉప సర్పంచ్ వార్డు మెంబర్లు కీలకంగా వ్యవహరించాలని ఆయన కోరారు. పంచాయతీల సమావేశాలు సకాలంలో జరగాలని, తీసుకున్న తీర్మానాలను సక్రమంగా అమలు జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. అనంతరం డిజిటల్ స్క్రీన్ పై గ్రామ పంచాయతీలకు సంబంధించిన కొన్ని అంశాలను బోధించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రామపంచాయతీ సెక్రటరీ బి. రాంబాబు, రామ్ సునీత తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పంగులూరు గ్రామపంచాయతీ సర్పంచి గుడిపూడి నాగేంద్రమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, రాయిని వెంకట సుబ్బారావు,వివిధ గ్రామపంచాయతీ సెక్రటరీలు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

# మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన



వేటపాలెం, మేజర్‌న్యూస్: మండలం పందిళ్లపల్లి 2, రామన్నపేట రైతు సేవా కేంద్రం పొలం పిలుస్తోంది ప్రోగ్రాం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్సి డిడిఏ విజయ నిర్మల వరిలో మేలైన యాజమాన్య పద్ధతులు, సాయిల్ టెస్ట్ బేస్డ్ ఎరువుల యాజమాన్యం గురించి మాట్లాడినారు. డిఎహెచ్ఓ జెన్నీమ్మ మామిడి తోటలో చేయవలసిన యాజమాన్య పద్ధతులు మరియు తోటల పునరుద్ధరణ గురించి వివరించినారు. ఎహెచ్ఓ అలేఖ్య మామిడి రైతుల స్టోరేజ్ అండ్ ప్యాక్ హౌస్ స్కీం గురించి చెప్పారు. ఏఓ కాశీ విశ్వనాథ్ వరిలో పురుగు మందుల పిచికారి, వాటి మోతాదు గురించి చెప్పారు. వెటర్నరీ అసిస్టెంట్ మిని గోకుల్ షెడ్ నిర్మాణ స్కీమ్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ రాజేష్, విలేజ్ అగ్రికల్ అసిస్టెంట్లు, పందిళ్లపల్లి రైతులు పాల్గొన్నారు.

# జిమ్ చేసిన యువకులకు గుండెపోటు.. కారణాలు ఇవేనా?



అధికంగా వ్యాయామం చేసినా, శారీరంగా అధికంగా కష్టపడినా గుండెపోటు రావడం అనేది అప్పటికే శరీరంలో ఉన్న అడ్డంకుల వల్ల జరుగుతుందని వైద్యులు చెప్తున్నారు. అప్పటివరకు శరీరంలో ఉన్న రోగాలను నిర్ధారణ చేసుకోపోవడం కూడా కారణమంటున్నారు. జిమ్ చేయడం వల్ల నష్టమేమీ ఉండదని.. అయితే అధికంగా వర్కవుట్లు చేసేవాళ్లు కోచ్ సలహాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. గుండె రక్తనాళాల్లో చీలిక ఏర్పడితే ఎలాంటి వ్యక్తులకు అయినా గుండెపోటు వచ్చే అవకాశం ఉంటుందని వైద్యులు వివరిస్తున్నారు. కొంతమందిలో బ్లాక్స్ లేకపోయినా అకస్మాత్తుగా రక్తం గడ్డ కడుతుందని.. అలాంటి వారిలో గుండెపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అంటున్నారు. కొందరిలో క్లాట్స్ ఏర్పడే తత్వం సహజంగానే ఉంటుందని.. అలాంటి వాళ్లు వ్యాయామాలు చేసే సమయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఆరోగ్యం సహకరించనప్పుడు జిమ్ చేయడం ప్రమాదకరమని.. బీపీ, డయాబెటిస్ వంటి రోగాలతో బాధపడే వ్యక్తులు వైద్యుల సలహాతోనే జిమ్ చేయడం ఉత్తమం అని వైద్యులు సూచిస్తున్నారు. గతంలో 40-50 ఏళ్లు దాటిన వ్యక్తులకే బీపీ, షుగర్ వంటి వ్యాధులు వచ్చేవి అని.. కానీ ప్రస్తుత కాలంలో ఆహారం విషయంలో శ్రద్ధ వహించక పోవడంతో యుక్త వయసులోనే రోగాలు దరిచేరుతున్నాయని.. దీంతో గుండెపోటు బారిన పడుతున్నారని వైద్యులు విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా ప్రస్తుతం యువత బాడీ షేప్‌లను దృష్టిలో పెట్టుకుని వ్యాయామాలు చేస్తున్నారని.. జిమ్‌లో చేసే పొరపాట్లు కూడా గుండెపోటుకు కారణం అవుతుందని వివరిస్తున్నారు. ప్రతి ఒక్కరిలో భారీ ఎక్సర్‌సైజులను తట్టుకునే సామర్థ్యం శరీరానికి ఉండదు అని.. శరీర సామర్థ్యం ఆధారంగానే వర్కవుట్లు చేయాలని హితవు పలుకుతున్నారు. ముఖ్యంగా కార్డియో ఎక్సర్‌సైజుల తరువాత 2-5 నిమిషాలు విరామం అవసరం అని.. దీనివల్ల గుండెకు కాస్త ప్రశాంతత లభిస్తుందని వైద్యులు చెప్తున్నారు. ఛాతి ఎడమ భాగంలో నొప్పిగా అనిపిస్తే వెంటనే వ్యాయామం చేయడం ఆపాలని.. వైద్యుడిని సంప్రదించాలని సూచిస్తున్నారు. కొందరు యువకులు మొండిగా వ్యాయామాలు చేస్తూ ప్రాణాలు కోల్పోతున్నారని అభిప్రాయ పడుతున్నారు. ధూమపానం అలవాటు ఉన్నవాళ్లు, గుండెపోటు చరిత్ర ఉన్న కుటుంబీకులు జిమ్‌లో అతిగా శ్రమించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గంటల తరబడి వ్యాయామం చేయడం కూడా మంచిది కాదని.. ప్రతిరోజు శరీరం సామర్థ్యం ఆధారంగా 30-45 నిమిషాల పాటు వ్యాయామం చేస్తే సరిపోతుందని వైద్యులు చెప్తున్నారు.

# 10 నుండి శ్రీగిరిలో శరన్నవరాత్రి ప్రత్యేక కార్యక్రమాలు

## ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి



ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణా రావు వెల్లడించారు. ఈ నెల 10వ తేదీ గురువారం ఉదయం 5 గంటలకు శ్రీవారికి తులసి దళాలతో సహస్రనామార్చన, సాయంత్రం 7 గంటలకు హనుమంత వాహన సేవ, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వెంకట శ్రీనివాసులుచే ఆధ్యాత్మిక ప్రసంగం జరుగుతాయి. 11వ తేదీ శుక్రవారం ఉదయం ఐదు గంటలకు శ్రీవారికి శుక్రవార అభిషేకం, సహస్రనామార్చన, సాయంత్రం ఏడు గంటలకు శ్రీవారికి ఊంజల సేవ, శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్‌చే భక్తి సంగీత విభావరి జరుగుతాయి. 12వ తేదీ శనివారం ఉదయం శ్రీవారికి తోమాల సేవ, సహస్రనామార్చన, సాయంత్రం ఆరు గంటలకు శ్రీవారి తిరు వీధి ఉత్సవం, అద్దంకికి చెందిన స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతాయి. భక్తులు శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాల ప్రత్యేక కార్య క్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు కోరారు.

# ప్రభుత్వ నిధుల దుర్వినియోగం చేసిన పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు



బల్లికురవ, మేజర్‌న్యూస్: ఎటువంటి పనులు జరగకుండా గ్రామ అభివృద్ధి నిమిత్తం పనులు చేశామంటూ ప్రభుత్వ నిధులు వేరు వేరు వ్యక్తులకు నగదు బదిలీ చేశారని పంచాయతీ కార్యదర్శి అనిల్‌పై బల్లికరవ గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు, బల్లికురవ, అంబడీపూడి, చెన్నుపల్లి పలు గ్రామాలకు పంచాయతీ కార్యదర్శి బాధ్యతలు నిర్వహిస్తున్న అనిల్ గడిచిన మూడు నెలల్లో 20 లక్షల రూపాయలకు పైగా నిధులు దుర్వినియోగం చేశారని స్థానిక మండల టిడిపి నాయకులు గొట్టిపాటి అనిల్ కుమార్, పావులూరి మోహనరావు, గొట్టిపాటి లక్ష్మయ్య, చల్లగుండ్ల నాగేశ్వరరావు, వార్డు సభ్యులు పావులూరి దుర్గ,స్థానిక బల్లికురవ ఎంపీడీవో కుసుమకుమారికి ఫిర్యాదు చేశారు. నిధుల బదిలీ చేసిన వారి వద్ద నుండి నగదు రూపాన, ఫోన్ పే ద్వారా కార్యదర్శి అనిల్ తన సొంత ఫోన్ పే నెంబర్‌కు మళ్లించుకున్నారన్నారు. సాక్ష్యాధారాలతో ఎంపిడిఓకు అర్జీతో జతపరిచామని వారు తెలిపారు. దీనిపై తక్షణమే విచారణ జరిపి నిజనిజాలు తెలుసుకొని వారిపై చర్యలు చేపట్టాలని కోరారు.